www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 148 | బుధవారం 15.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-



**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039


# ఢిల్లీలో సీఎం బిజీబిజీ..

## కేంద్రమంత్రులు గడ్కరీ, రామ్మోహన్‌తో కీలక భేటీలు

### తెలంగాణకు మరో రెండు ఎయిర్‌పోర్టులు..

- ఢిల్లీలో కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ భేటీ
- రీజినల్ రింగ్ రోడ్డుపై గడ్కరీతో చర్చలు
- ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి త్వరిత ఆమోదం కోరారు
- దక్షిణ భాగానికి కేంద్ర అనుమతులు కోరిన సీఎం
- హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదన
- జాతీయ రహదారుల అభివృద్ధిపై కేంద్రంతో చర్చలు
- రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్ సమావేశం
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులపై కీలక చర్చలు
- విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి

02

**కాకతీయ సంస్కృతికి అద్దంపట్టేలా నిర్మిస్తాం**

నార్త్ ఆర్ఆర్ఆర్కు మోక్షం కలిగించాలి

కేంద్ర కేబినెట్లో -ఆమోదముద్ర వేయించండి

కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ అభ్యర్థన



**న్యూ ఢిల్లీ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపై చర్చించారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్, ఎంపీ రఘువీర్ రెడ్డి, రాష్ట్ర అధికారులు సమావేశమై రీజినల్ రింగ్ రోడ్డు తో పాటు తెలంగాణలోని పలు జాతీయ రహదారుల నిర్మాణాల గురించి మాట్లాడారు.

**రీజినల్ రింగ్ రోడ్డుపై చర్చ..**

ఈ సమావేశంలో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి 95 శాతం భూసేకరణ పూర్తయిందని సీఎం వివరించారు.

# ప్రజా సంక్షేమం ఆపే ప్రసక్తే లేదు

## అప్పుల పాలన మళ్లీ రావద్దు

### అధికారంలో దోపిడీ.. ఇప్పుడు విమర్శలా?



- ప్రతిపక్షాలపై భట్టి విక్రమార్క ఘాటు విమర్శలు
- అప్పుల తెలంగాణను కాంగ్రెస్‌కు అప్పగించారు
- సంక్షేమ పథకాలు ఆపేందుకే అధికారమా?
- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- రూ.8.21 లక్షల కోట్ల అప్పుల ఆరోపణ
- సంక్షేమ పథకాలు నిరంతరం కొనసాగుతున్నాయి
- ఉచిత బస్సు ప్రయాణానికి రూ.12 వేల కోట్లు
- కోటి కుటుంబాలకు ఉచిత సన్నబియ్యం పంపిణీ
- ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు
- 27 లక్షల విద్యార్థులకు అల్పాహారం, పాలు
- 100 ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నాం


03

# కడియం వర్సెస్ కొండా సురేఖ

## చిన్న విషయాలను పట్టించుకోకండి

- కాంగ్రెస్‌లో కడియం-సురేఖ విభేదాలు ముదిరాయి
- ఏఐసీసీ ఇన్‌చార్జ్‌ను కలిసిన కొండా సురేఖ
- నాలుగు పేజీల ఫిర్యాదు అందజేసిన సురేఖ
- కడియం తీరుపై అధిష్టానానికి ఫిర్యాదు
- ఆత్మగౌరవం దెబ్బతింటోందని సురేఖ ఆవేదన
- దేవాదాయ శాఖ సమీక్షపై సురేఖ అభ్యంతరం
- వివాదాలకు దూరంగా ఉండాలని ఏఐసీసీ సూచన
- పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచన
- చిన్న విషయాలు పట్టించుకోవద్దన్న మీనాక్షి

03



నాక్షి నటరాజన్‌తో జరిగిన భేటీలో కొండా సురేఖ తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. కడియం శ్రీహరి వ్యవహారశైలిపై సుమారు నాలుగు పేజీల ఫిర్యాదు లేఖను మీనాక్షి నటరాజన్ కు అందజేసిన కొండా సురేఖ తనకు సమాచారం ఇవ్వకుండా, తన పరిధిలోని దేవాదాయ శాఖపై కడియం శ్రీహరి సమీక్షలు నిర్వహించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇది తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని, తనను కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారని సురేఖ ఆవేదన వ్యక్తం తెలుస్తోంది.

**సింగరేణిని కేసీఆర్ తన జేబు సంస్థగా మార్చుకున్నారు**

సింగరేణి నిధులు స్థానికంగానే ఖర్చు చేయాలి

# కార్మికుల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

## అప్పులతో సింగరేణిని బలహీనపరిచారు




- సింగరేణి నిధులు సింగరేణి ప్రాంతానికే ఖర్చు చేయాలి
- కొడంగల్, సిద్దిపేట, సిరిసిల్లకు నిధులు ఎందుకు?
- సింగరేణి కార్మికులతో ముఖాముఖి నిర్వహించిన కిషన్ రెడ్డి
- సింగరేణి సంక్షేమాన్ని కాంగ్రెస్, బీఆర్ఎస్ విస్మరించాయి
- 17 ఏళ్లుగా సంస్థ వెనుకబడడానికి గత ప్రభుత్వాలే కారణం
- సింగరేణిని కేసీఆర్ జేబు సంస్థగా మార్చుకున్నారు
- సింగరేణి పేరుతో వేల కోట్ల దోపిడీ జరిగిందని విమర్శ
- సంస్థ నిధులను కుటుంబ నియోజకవర్గాలకు మళ్లించారని ఆరోపణ
- రేవంత్ ప్రభుత్వం కూడా భారీ అప్పులు చేస్తోంది
- కార్మికులకు జెండా కాదు.. ఎజెండా ముఖ్యం: కిషన్ రెడ్డి

03

# పహల్గాం ఎటాక్ కేసులో హాఫీద్ పై నాన్ బెయిలబుల్ వారెంట్

- పహెల్గాం ఉగ్రదాడి కేసులో హాఫీజ్ సయీద్‌కు ఎన్‌బీడబ్ల్యూ
- లష్కరే తోయిబా చీఫ్‌పై ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు వారెంట్
- అనుబంధ ఛార్జ్‌షీట్‌లో కీలక నిందితుడిగా హాఫీజ్ సయీద్
- 26 మంది ప్రాణాలు తీసిన పహెల్గాం దాడిపై దర్యాప్తు వేగం
- ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా కుట్ర: ఎన్ఐఏ
- యూఏపీఏ, బీఎన్ఎస్ కింద హాఫీజ్ సయీద్‌పై కఠిన అభియోగాలు

02



# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించాలి



**రక్తం పాకెట్లతో రాజకీయం అవసరం లేదు..**

## ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?

- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసిన కాంగ్రెస్ బృందం
- హైదరాబాద్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ 15 శాతం కూడా పూర్తి కాలేదు
- బీఎల్ఓలు సమర్థంగా పనిచేయడం లేదు
- ఎల్ నినోపై శాస్త్రవేత్తల హెచ్చరికలను పరిగణలోకి తీసుకుంటున్నాం
- కాళేశ్వరం కుంగిపోవడానికి బీఆర్ఎస్‌దే బాధ్యత
- ఎన్డీఎస్ఏ తుది నివేదిక వచ్చిన వెంటనే నీళ్లు నింపుతాం
- నిపుణుల సూచనల మేరకే ప్రభుత్వం నిర్ణయాలు
- కరువును దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

02



# పెద్దపల్లిలో ఏసీబీ దాడులు..

- రూ.2 లక్షల లంచంతో ఏఈ సతీష్ పట్టుబాటు
- పెద్దపల్లి మున్సిపల్‌లో ఏసీబీ మెరుపు దాడులు
- లంచం తీసుకుంటూ ఏఈ రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్
- కాంట్రాక్టర్ ఫిర్యాదుతో ఏసీబీ వల పన్నింది
- బిల్లుల మంజూరుకు భారీ లంచం డిమాండ్ చేసిన ఏఈ
- మున్సిపల్ కార్యాలయంలో అవినీతి బాగోతం బట్టబయలు
- ఏసీబీ వలలో చిక్కిన మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్
- లంచం తీస్తుండగా ఏఈని పట్టుకున్న ఏసీబీ అధికారులు

06

## మున్సిపల్ అధికారుల అవినీతి మరోసారి వెలుగులోకి

# కనీస అవగాహన లేకుండా పాలిస్తున్నారు..

## హెడ్‌లైన్స్ కోసమే రేవంత్ వ్యాఖ్యలు

- రేవంత్ విమర్శలకు ఈటల ఘాటు కౌంటర్
- నీచమైన భాష మానేసి నీటి సమస్యలపై దృష్టి పెట్టాలి
- సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నీటి నిల్వకు ఎన్డీఎస్ఏ సూచన
- పంటలు ఎండిపోతున్నాయి.. రైతుల్లో తీవ్ర ఆందోళన
- తాగునీటి సమస్యపై ప్రభుత్వం అప్రమత్తం కావాలి

05






## హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ ఇంట్లో ఏసీబీ రైడ్స్

- రూ.10 లక్షల గ్యాడ్జెట్లు సీజ్ చేసిన ఏసీబీ
- జడ్చర్లలో ఏడు ప్లాట్లు గుర్తించిన అధికారులు
- నాలుగు అంతస్తుల భవనం ఏసీబీ గుర్తింపు
- శంషాబాద్‌లో వ్యవసాయ భూములు వెలుగులోకి

02

# పహల్గాం ఎటాక్ కేసులో హాఫీద్ పై నాన్ బెయిలబుల్ వారెంట్

**న్యూ ఢిల్లీ :** భారత దేశంలో తీవ్ర విషాదం నింపిన పహెల్గాం ఉగ్రదాడి కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థ 'లష్కరే తోయిబా' అధినేత హాఫీజ్ సయీద్‌కు ఎన్ఐఏ కోర్టు నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) జారీ చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి కేసులో హాఫీజ్ సయీద్‌పై ఎన్ఐఏ జూలై 6న అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా.. ఆ తర్వాత రెండు రోజులకు, అంటే జూలై 8న ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఈ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది ఏప్రిల్ 22న దక్షిణ కాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతమైన పహల్గాంలో ఉగ్రవాదులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ కాల్పుల్లో పర్యాటకులతో సహా మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఉగ్రదాడి వెనుక లష్కరే తోయిబా కుట్ర ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించి విచారణను ముమ్మరం చేసింది.

**అనుబంధ ఛార్జ్‌షీట్‌లో కీలక నిందితుడిగా..**

భారత్, అమెరికా దేశాలచే అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించబడిన 76 ఏళ్ల హాఫీజ్ సయీద్‌పై జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులో ఈ అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలైంది. లష్కరే తోయిబా అధినేతగా, అలాగే దానికి ప్రాక్సీగా వ్యవహరిస్తున్న 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' రూపకర్తగా సయీద్‌పై కేసులు నమోదయ్యాయి. సయీద్ పై ఉపా చట్టంతో పాటు BNS 2023 చట్టంలోని పలు సెక్షన్ల కింద కఠినమైన సెక్షన్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. నింధితుడిపై మోపిన అభియోగాలకు తగిన ఆధారాలు ఉన్నాయని భావించిన న్యాయస్థానం ఈ కేసును విచారణకు స్వీకరించి నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ ను జారీ చేసింది.

**ట్రయల్స్ కు రాకపోయినా విచారణ:**

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ సర్గోధా నివాసి అయిన హాఫీజ్ సయీద్ పహల్గామ్ ఉగ్రదాడి కేసులో ప్రధాన నిందితుడని, అతను కావాలనే అరెస్టు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడని ఎన్ఐఏ కోర్టుకు తెలిపింది. ఈ కేసులో నిష్పక్షపాతంగా, సమగ్రంగా, సమర్థవంతంగా దర్యాప్తు ముగించాలంటే నిందితుడైన హాఫీజ్ సయీద్‌ను అరెస్ట్ చేయడం, కస్టడీలోకి తీసుకుని విచారించడం అత్యవసరం. అందువల్ల అతనిపై నాన్-బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తున్నామని కోర్టు స్పష్టం చేసింది. అయితే సయీద్ ఇండియాకు రాకపోయినప్పటికీ విచారణ కొనసాగనుంది. 2024లో అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టం 'భారతీయ నాగరిక్ సురక్ష సంహిత - 2023'లోని సెక్షన్ 356 ప్రకారం నిందితుడు అందుబాటులో లేకపోయినా అతనిపై విచారణ జరిపి శిక్ష వేయవచ్చు. దీన్నే 'ట్రయల్ ఇన్ అబ్సెన్షియా' అంటారు.

# ఢిల్లీలో సీఎం బిజీబిజీ..

## కేంద్రమంత్రులు గడ్కరీ, రామ్మోహన్‌తో కీలక భేటీలు



**న్యూ ఢిల్లీ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపై చర్చించారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సీఎం రేవంత్, ఎంపీ రఘువీర్ రెడ్డి, రాష్ట్ర అధికారులు సమావేశమై రీజినల్ రింగ్ రోడ్డు తో పాటు తెలంగాణలోని పలు జాతీయ రహదారుల నిర్మాణల గురించి మాట్లాడారు.

**రీజినల్ రింగ్ రోడ్డుపై చర్చ..**


ఈ సమావేశంలో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి 95 శాతం భూసేకరణ పూర్తయిందని సీఎం వివరించారు. ఉత్తర భాగం పనులు ప్రారంభించేందుకు కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలని నితిన్ గడ్కరీని కోరారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగానికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు అవసరమైన కేంద్ర అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హైదరాబాద్ అమరావతి మధ్య 12వ వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టాలని కూడా సీఎం రేవంత్ కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా, పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

**కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సీఎం రేవంత్ సమావేశం..**

మరోవైపు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ రఘువీర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. రాష్ట్రంలోని అదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న విమానాశ్రయాల అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ప్రత్యేకంగా అదిలాబాద్ విమానాశ్రయం, వరంగల్‌లోని మామునూరు విమానాశ్రయానికి సంబంధించిన డిజైన్, మౌలిక వసతుల కల్పన, నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. ఈ ప్రాజెక్టులను వేగవంతం చేసి తెలంగాణలో ప్రాంతీయ విమాన సేవలను విస్తరించాలని సీఎం కేంద్రాన్ని కోరారు. రాష్ట్రంలో రహదారులు, విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్ర సహకారం అందించే అంశంపై ఈ భేటీలు కీలకంగా మారాయి. వరంగల్ విమానాశ్రయం ఆకృతిలో కాకతీయ సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయిడుతో చర్చించామని తెలిపారు. రెండు ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్రమంత్రి సహకరిస్తున్నారని వెల్లడించారు. దేశ జనాభాలో 2.50 శాతం జనాభా ఉన్న తెలంగాణ.. 5 శాతం జీడీపీ వాటా కలిగి ఉందని చెప్పుకొచ్చారు. ఈరోజు (మంగళవారం) ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుని కలిశారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆ స్ఫూర్తి కొనసాగుతోంది...**

తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలంటే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విమానాశ్రయాలు అవసరమని సీఎం తెలిపారు. ఈ రెండు విమానాశ్రయాల పనులు 2028, జూన్ 2వ తేదీ నాటికి పూర్తి చేసి ఆ రోజు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వ సహకారానికి అవసరమైన చర్చలు చేపడుతున్నామని వివరించారు. అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార స్ఫూర్తి కొనసాగుతోందని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో ఢిల్లీ వచ్చి కేంద్రమంత్రులను కలుస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ ఇంట్లో ఏసీబీ రైడ్స్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్ నివాసంలో సోదాలు ముగిశాయని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు. ఈ సోదాల్లో అతని వద్ద ఆదాయానికి మించిన అక్రమ ఆస్తులు భారీగా గుర్తించినట్లు తెలిపారు. సోదాల అనంతరం ఆయన మాట్లాడారు. సుమధుర అక్రోపోలిస్‌లో 3BHK ఫ్లాట్, శ్రీవారి మెడోస్‌లో మరో ఫ్లాట్ ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వాసవి అట్లాంటిస్‌లో ఏకంగా మూడు ఫ్లాట్లు కొనుగోలు చేసినట్లు కనుగొన్నామని చెప్పారు. మసీద్ బండలో నాలుగు అంతస్తుల భారీ భవనం, జడ్చర్లలో 7 ప్లాట్లు, కొండాపూర్‌లో రెండు ప్లాట్లు ఉన్నాయని వివరించారు. శంషాబాద్, షాబాద్ పరిధిలో 4 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు తమకు ఆధారాలు లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సోదాల్లో అర కిలో బంగారం, వెండి వస్తువులతో పాటు రూ. 10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ సీజ్ చేశామని అన్నారు. అలాగే బచ్చు రవీందర్ పేరిట ఉన్న 4 బ్యాంక్ లాకర్లను గుర్తించి.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఆస్తులతో పాటు ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా దాచి ఉంచిన 18 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీఖాన్ వెల్లడించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించాలి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగించాలని తెలంగాణ కాంగ్రెస్ తెలంగాణ ఎన్నికల సంఘాన్ని కోరింది. ఈ మేరకు ఇవాళ మంత్రి పొన్నం ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ బృందం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం.. ఎస్ఐఆర్ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని హైదరాబాద్ లో 15 శాతం కూడా పూర్తి కాలేదని అన్నారు. బీఎల్ఓలు సరిగా పని చేయడం లేదని అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకోవాలని కోరినట్లు చెప్పారు.

**రక్తం పాకెట్లతో రాజకీయం అవసరం లేదు:**

అనంతరం మీడియోతో ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి.. అనేక మంది శాస్త్రవేత్తలు ఎల్ నినో ప్రభావంతో వాతావరణ శాఖ వర్షాభావ పరిస్థితులు ఇబ్బందులు ఉంటాయని చెబుతున్నారని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకముందే కాళేశ్వరం కుంగిపోయిందని రక్తం పాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని, ఊరూరా తిరిగి ఆ పార్టీ కుట్రలు ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఎన్డీఎస్ఏ తుది నివేదిక ప్రకారం నీళ్లు నింపమని చెప్తే మేం వెంటనే నింపుతామన్నారు. మేము ఇంజనీర్లం కాదు.. ఇంజనీర్లు ఇచ్చిన సలహాలు పాటిస్తామన్నారు. ప్రాజెక్ట్ ఉపయోగంలోకి రావాలంటే ఏమి చేయాలో నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని చెప్పారు.

**ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు?:**

గత రెండు సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండి ఇప్పుడు కరువును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతోందని విమర్శించారు. కావాలని మేడిగడ్డ ,కన్నెపల్లిపై రాజకీయం చేస్తున్నారని సాంకేతిక నిపుణులతో నేషనల్ డామ్ సేఫ్టీ అధికారులు ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎల్ నినో ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరుపున సూచనలు చేస్తున్నామని కరువును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలన్నారు. శంకర పరివారంలో ఆవు, పాము, నెమలి ఉంటాయి. అన్ని వ్యక్తిగతంగా వైరుధ్యం ఉన్న అక్కడ కలిసి ఉంటాయి ఇక్కడ కూడా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంతో కోట్లడాలని రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలన్నారు. బండి సంజయ్ ఎన్డీఎస్ఏను తుది నివేదిక ఇవ్వమని చెప్పాలన్నారు. వారు చెప్పి విధంగా నీళ్ళు నింపుతామన్నారు. నింపిన తరువాత ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు? అని ప్రశ్నించారు. గత రెండు సంవత్సరాలు గేట్లు వేయనప్పుడు ఎవరు మాట్లాడలేదని కేటీఆర్, హరీశ్ రావు ప్రభుత్వానికి సూచనలు చేయవచ్చు. కానీ లేనిది ఉన్నట్టు బట్ట కాల్చి మీద వేయవద్దన్నారు. బాధ్యతగా ప్రతిపక్షం సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు.

# అనుచిత వ్యాఖ్యలు సరికాదు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** యాదాద్రి టెంపుల్ ట్రస్ట్ మెంబర్ మాజీ కార్పొరేటర్ పోచనబోయిన ఈశ్వరమ్మ యాదవ్ పై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న జక్కిడి శివ చరణ్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని మిర్యాలగూడ పట్టణ యాదవ సంఘం అధ్యక్షులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్ సీనియర్ నాయకులు సర్నాల వెంకన్న యాదవ్ అన్నారు. స్థానిక యాదవ్ సంఘ భవనం మిర్యాలగూడ నందు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ 80 సంవత్సరాల వయసులో ఉండి ప్రజాసేవలో ఉన్న వ్యక్తిని వయసులో తారతమ్యం కూడా తెలియకుండా ఇష్టం వచ్చిన రీతిన మాట్లాడుతూ ఒక చదువుకున్న వ్యక్తి రాష్ట్రంలో ఉన్న యువతకు ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తి అనుచితంగా అవమానకరంగా మాట్లాడడం సరి అయింది కాదని దీనిని గుర్తిస్తూ వెంటనే ఈశ్వరమ్మ యాదవ్ కి క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో మరోసారి శివ చరణ్ రెడ్డి ఇంటిని ముట్టడింస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ పట్టణ 4 వ వార్డ్ కౌన్సిలర్ పుట్టపాక శ్రీనివాస్ యాదవ్ 28వ వార్డ్ కౌన్సిలర్ గంగుల బిక్షం యాదవ్ యూత్ గౌరవాధ్యక్షులు జంగా లక్ష్మణ్ యాదవ్ యూత్ సహ అధ్యక్షులు బచ్చుబోయిన మహేష్ యాదవ్ మట్టపల్లి సునీల్ తదితరులు పాల్గొన్నారు




# ఏపీ రాజకీయాల్లో తీవ్ర విషాదం..

**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం (73) కాసేపటి క్రితం కన్నుమూశారు. గత కొంతకాలంగా కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఇవాళ తుదిశ్వాస విడిచారు. అయితే, ముద్రగడ మృతి పట్ల రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలువురు రాజకీయ, సినీ రంగ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలుపుతున్నారు.



ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# కార్మికుల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

**భూపాలపల్లి,ఫ్లాష్ ఇండియా :** సింగరేణి నిధులు సింగరేణి ప్రాంతంలోనే ఖర్చు పెట్టాలి తప్ప ఆ నిధులను కొడంగల్ సిద్దిపేట సిరిసిల్లకు ఎందుకు తల్లిస్తున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రశ్నించారు. ఆయన మంగళవారం భూపాల్ పల్లి జిల్లా కేంద్రంలోని 8 ఇంక్లైన్ కాలనీ సింగరేణి కార్మికులతో ముఖా ముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు కేవలం వారి స్వార్థ రాజకీయాల కోసం పనిచేస్తున్నాయని సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయడం లేదని ఆయన అన్నారు. గత 17 సంవత్సరాలుగా సింగరేణి సంస్థ నష్టాలకు కూరుకపోవడానికి వారే కారణమన్నారు. మొదట కాలనీ వద్ద కార్మికులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ బీజేపీ జెండాను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు ఎగుర వేశారు. కాంగ్రెస్ పార్టీ 2013కు ముందు సింగరేణి కంపెనీలను ప్రైవేట్ పరం చేస్తుందని రూ.2 లక్షల కోట్లకు పైగా అవినీతి జరిగితే సుప్రీంకోర్టు అన్ని రద్దు చేసి ఆప్షన్ల ద్వారా ఇవ్వాలని తీర్పు ఇచ్చిందని ఫామ్ హౌస్‌లో ఉన్న అతను కిషన్ రెడ్డి ఏం చేస్తున్నాడని ఉత్తరాలు రాస్తున్నారని,10 సంవత్సరాలు సీఎంగా ఉన్నప్పుడు ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. తాడిచర్ల 1ను ప్రైవేట్ చేసి ఎమ్మార్ కంపెనీకి అప్పజెప్పారని ఆయన అన్నారు. రూ.25,200 కోట్లు బీఆర్ఎస్ పార్టీ అప్పు పెట్టి పోయిందని ఆరోపించారు.అబద్ధాలు చెప్పి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాడని కాంగ్రెస్ వచ్చి కేవలం రెండున్నర సంవత్సరాలలోనే రూ.25,275 కోట్లు అప్పు చేసిందని ఆయన ఆరోపించారు. అన్నిటికి అప్పు అడిగే రేవంత్ రెడ్డి అప్పు చేసి సింగరేణికి ఇవ్వాల్సిన డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కంపెనీ ఉంటేనే యూనియన్ లు ఉంటాయని, కార్మికులకు జెండా ముఖ్యం కాదు ఎజెండా ముఖ్యమన్నారు. నైనీ కోల్ బ్లాక్ కేసీఆర్ పట్టించుకోలేదని అన్నారు. ఆఫీసర్ లు సమ్మె చేస్తున్నారు. తనను కలవడానికి ప్రయత్నిస్తే ట్రాన్స్ఫర్లు చేస్తామని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరిస్తున్నారని, ఎవరో మెప్పి వచ్చిందని సింగరేణి డబ్బులు హైదరాబాద్‌లో ఖర్చు పెట్టారని, ఇది ఎంతవరకు సమంజసం అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సింగరేణి కార్మికులకు ఇన్కమ్ టాక్స్ ను రీయింబర్స్ మెంట్ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచంద్ర రావు తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

**సింగరేణిని కేసీఆర్ తన జేబు సంస్థగా మార-్చుకున్నారు : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

బీఆర్ఎస్ హయాంలో.. సింగరేణిని అప్పటి సీఎం కేసీఆర్ తన జేబు సంస్థగా మార-్చుకున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. భూపాలపల్లిలో బీజేపీ చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర రెండో రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో సింగరేణి 15 సంవత్సరాలు వెనుకబడిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో కూడా సింగరేణిలో అదే పరిస్థితి నెలకొందని, ప్రస్తుతం సంస్థకు లాభాలు లేక కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. సింగరేణి అభివృద్ధిపై కేసీఆర్ ఏనాడూ కేంద్రాన్ని సంప్రదించలేదన్నారు. సింగరేణి వాళ్ల తాత జాగీరు అన్న చందంగా గత, ప్రస్తుత ప్రభుత్వాలు వ్యవహరించాయని ఆరోపించారు. సింగరేణి పేరుతో బీఆర్ఎస్ నేతలు వేలకోట్ల రూపాయలను దోచుకున్నారన్నారు. సింగరేణి నిధులను ఆ ప్రాంతంలోనే ఖర్చు చేయకుండా.. కేసీఆర్ కుటుంబ సభ్యుల నియోజకవర్గాల్లో ఖర్చు చేశారని, గతంలో కేంద్రం మనకు కోల్ బ్లాక్ లు ఇచ్చినా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు.కేసీఆర్ పాలనలో జెన్ కో కు రూ.8,958 కోట్ల అప్పు ఉంటే.. రేవంత్ పాలనలో అది రూ.26,875 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు అప్పుకోసం సీఎం రేవంత్ తమను బెదిరించే స్థాయికి వచ్చారన్నారు. సింగరేణిలో నాణ్యమైన బొగ్గు లేదని చెప్తున్నారని, ఇది చాలా ప్రమాదకరమైన విషయంగా పరిగణించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తాడిచర్ల-2 ద్వారా సింగరేణికి చాలా లాభం చేకూరుతుందని స్పష్టం చేశారు.

# ప్రజా సంక్షేమం ఆపే ప్రసక్తే లేదు






**రాజోలి,ఫ్లాష్ ఇండియా :** పదేళ్ల పాటు రాష్ట్ర సంపదను దోచుకుని తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన వారు మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్నారని, వచ్చి పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేయడానికేనా అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం తెలంగాణను రూ.8.21 లక్షల కోట్ల అప్పులతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించిందని ఆరోపించారు. అయినప్పటికీ రెండున్నరేళ్లలో రూ.2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీ చెల్లిస్తూ ప్రజా సంక్షేమాన్ని ఏమాత్రం తగ్గించకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.రాష్ట్రంలో ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ భీమా, వడ్డీలేని మహిళా రుణాలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల వంటి పథకాలను నిరంతరంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం కోసం ఇప్పటికే ఆర్టీసీకి రూ.12 వేల కోట్లు చెల్లించామని, కోటి 6 లక్షల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా సౌకర్యాలు కల్పిస్తున్నామని, హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచామని చెప్పారు.అదనంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి రూ.22,500 కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నామని, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ భీమా పథకాన్ని నవంబర్‌లో ప్రారంభిస్తామని వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రెండున్నరేళ్లలో డ్వాక్రా సంఘాలకు రూ.76 వేల కోట్ల వడ్డీలేని రుణాలు అందించామని తెలిపారు. అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై స్పందిస్తూ, మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు అవసరమైన 573 ఎకరాల భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని ప్రకటించారు. భూసేకరణ అనంతరం 87,500 ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళు-్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల మద్దతు కొనసాగుతోందని భట్టి విక్రమార్క అన్నారు.

**నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయం**

నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్చాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# కడియం వర్సెస్ కొండా సురేఖ



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్‌లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వర్సెస్ మంత్రి కొండా సురేఖ మధ్య విభేదాలు చివరకు పార్టీ అధిష్టానం వద్దకు చేరాయి. ఈ ఇద్దరు నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విభేదాలు కొనసాగుతున్న వేళ ఏఐసీసీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ ఇవాళ హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. తాజాగా ఆమెను కలిసిన మంత్రి కొండా సురేఖ, కడియం శ్రీహరి తీరుపై నాలుగు పేజీల ఫిర్యాదు లేఖనుం అందజేశారు.

**ఆత్మగౌరవం దెబ్బతీస్తున్నారని ఆవేదన:**

నాక్షి నటరాజన్‌తో జరిగిన భేటీలో కొండా సురేఖ తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. కడియం శ్రీహరి వ్యవహారశైలిపై సుమారు నాలుగు పేజీల ఫిర్యాదు లేఖను మీనాక్షి నటరాజన్ కు అందజేసిన కొండా సురేఖ తనకు సమాచారం ఇవ్వకుండా, తన పరిధిలోని దేవాదాయ శాఖపై కడియం శ్రీహరి సమీక్షలు నిర్వహించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇది తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని, తనను కావాలనే ఇబ్బందులకు గురి చేస్తున్నారని సురేఖ ఆవేదన వ్యక్తం తెలుస్తోంది. తన పని తాను చేసుకుంటుంటే, అనవసరంగా వివాదాల్లోకి లాగుతున్నారని, కడియం శ్రీహరి తీరు సరికాదని ఆమె ఇంఛార్జికి వివరించినట్లు తెలుస్తోంది. అయితే కడియం శ్రీహరి విషయాన్ని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పెద్దలకు ఫిర్యాదు చేసిన మంత్రి.. ఇవాళ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లారు.

**చిన్న విషయాలను పట్టించుకోకండి:**

మంత్రి కొండా సురేఖ వాదనలను విన్న మీనాక్షి నటరాజన్.. ఆమెకు పలు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. చిన్న చిన్న విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పని చేయాలని సూచించినట్లు సమాచారం. మీరు ఒక బీసీ లీడర్‌గా పార్టీలో పెద్ద బాధ్యతను కలిగి ఉన్నారని కాబట్టి, వివాదాలకు తావివ్వకుండా, పార్టీని బలోపేతం చేసే దిశగా దృష్టి పెట్టాలని మీనాక్షి స్పష్టం చేసినట్లు తెలిసింది. చాలా కాలంగా ఈ ఇద్దరు నేతల మధ్య విభేదాలు కొనసాగుతుండగా తాజాగా దేవాయాద శాఖపై సమీక్షతో మరోసారి మాటల యుద్ధం అధిష్టానం జోక్యంతో-నైనా ఈ 'కౌంటర్-ఎన్‌కౌంటర్' రాజకీయాలకు తెరపడుతుందో లేదో చూడాలి.

# బ్యారేజీలకు ఏం జరిగినా రాజీనామా చేస్తాం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల మంటలు కొనసాగుతున్నాయి. పరస్పర విమర్శలతో రాజకీయం వేడెక్కుతున్న తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారీ నీటిపా-రుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చాలెంజ్ విసిరారు. కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తి పోయాలని ఆ క్రమంలో అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ఏ చిన్న సమస్య వచ్చినా అందుకు పూర్తి బీఆర్ఎస్ ఎమ్మెల్యేమంతా బాధ్యత వహిస్తూ రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో కూడా పోటీ చేయమని సవాల్ విసిరారు. మా చాలెంజ్‌ను స్వీకరించే దమ్ము ముఖ్యమంత్రి, ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఉందా అని ప్రశ్నించారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో మీడియాతో మాట్లాడుతూ రైతుల ఆవేదన చూసి కడుపు మంటతో మాట్లాడుతున్నానన్నారు.

**మా రక్తం తీసుకుని రైతులకు నీళ్లు ఇవ్వండి:**

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై ముఖ్యమంత్రి ఎదురుదాడి చేస్తున్నారని అవసరం అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తల రక్తం తీసుకుని రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం విషయంలో ఇన్నాళ్లు తాము చేసిన అబద్ధాలు ప్రజలకు అర్థం అవుతాయ నే కన్నెపల్లి పంప్ హౌస్ లు ఆన్ చేయడంలేదని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మిమ్మల్నీ కుర్చీలో కూర్చోబెట్టడమే రైతులు చేసిన తప్పా అని ప్రశ్నించారు. ఉత్తర తెలంగాణ రైతులకు ఎందుకు అన్యాయం చేస్తున్నారని నిలదీశారు. రైతులకు నీళ్లు ఇస్తే ఎరువులు ఇవ్వాల్సి వస్తుందని, పండిన పంటలను కొనాల్సి వస్తుందనే చిల్లర రాజకీయాల కోసం రేవంత్ రెడ్డి రైతులకు నీళ్లు ఇవ్వడం లేదన్నారు.

# నగరంలోని నిరుపేదలకు గుడ్ న్యూస్


**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గ్రామీణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్లతో పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజా ప్రభుత్వం, ఇప్పుడు అదే సంకల్పంతో క్యూర్ పరిధిలోని పేదల సొంతింటి స్వప్నాన్ని నిజం చేసేందుకు మరో చారిత్రాత్మక అడుగు వేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా క్యూర్ పరిధిలో దశల వారీగా లక్ష ఎల్.ఐ.జీ. ఇందిరమ్మ ఇండ్లను నిర్మించబోతున్నామని, ఇందుకు సంబంధించి ఇప్పటికే పరిపాలనా అనుమ-తులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలో ఎల్ఐజీ ఇందిరమ్మ ఇండ్లపై హౌసింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీన క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల పథకానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ జిల్లా మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌తో కలిసి పథకానికి సంబంధించిన విధివిధానాలను, దరఖాస్తుల ఆహ్వానం, అర్హతలు, టెండర్ల ప్రక్రియ, అమలు విధానం తదితర పూర్తి మార్గదర్శకాలను ప్రకటిస్తామని వివరించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో క్యూర్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఎల్ఐజీ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తొలి దశలో పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గానికి కనీసం 500 చొప్పున, ఆయా స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైన చోట వెయ్యి వరకు నిర్మిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.గత ప్రభుత్వం ఎలాంటి ముందుచూపు లేకుండా, హైదరాబాద్ నగరానికి 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో అక్కడక్కడ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించడం వల్ల తమ జీవనోపాధి దెబ్బతింటుందని, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది అక్కడ నివసించలేకపోయారని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం పేదల జీవన వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని, వారు ప్రస-్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే, వారి ఉపాధి, పిల్లల విద్య, వైద్య సౌకర్యాలు, రవాణా వంటి అంశాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని అత్యంత ముఖ్యమైన ప్రాంతాలలో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లను నిర్మిస్తోందని అన్నారు. ఆ స్థలంలో వారికి వాటా ఇస్తూ యాజమాన్య హక్కు కల్పిస్తూ వారి కుటుంబాలకు శాశ్వత ఆర్థిక భద్రతను కల్పిస్తున్నామన్నారు.క్యూర్ పరిధిలో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నియోజకవర్గాలలో స్థలాలను గుర్తించడం జరిగిందని, ఈ స్థలాలను ఇప్పటికే హౌసింగ్ విభాగం పొజిషన్‌లోకి తీసుకుందని తెలిపారు. ఎక్కడ ఎన్ని ఇండ్లు, ఎన్ని అంతస్తులు నిర్మించాలి, ఒక్కో ప్లాట్ విస్తీర్ణం, బిల్డింగ్ డిజైన్‌లను సీఎం రేవంత్ రెడ్డి గారితో చర్చించి రెండు, మూడు రోజులలో తుది రూపును ఇస్తామని వెల్లడించారు.

# ఘనంగా డాక్టర్ మల్లు రవి జన్మదిన వేడుకలు



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్. మల్లు రవి. జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు, అనంతరం పండ్ల పంపిణీ, ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సి వెంకట్ రెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ అంజయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీలు జి శ్రీనివాసమూర్తి, ఎం అంబాజీ, మాజీ ఉపసర్పంచ్ లు బి నర్సింలు అజీజ్ నాయకులు ఏ .వెంకట్ రెడ్డి, వద్దే రాజు, పులిజాల విష్ణు, కే.చెన్నాయ్య, నసిర్, ఇర్ఫాన్, జాఫర్, చిపిరి దర్శన్, బొడ్డుపల్లి బాలస్వామి, పాల్గుణ ,నవీన్, ఆఫ్తాబ్, టి సత్యనారాయణ గౌడ్, ఎస్ జనార్ధన్ రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం




## అభివృద్ధి అసంపూర్ణమే

స్వాతంత్య్రం సాధించి ఏడు దశాబ్దాలకు పైగా గడిచినా భారతదేశం ఇంకా పూర్తిగా అధిగమించలేని ప్రధాన సమస్యల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఒకటి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి ఏర్పడిన సంస్థ. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల పన్నుల ద్వారా జీతాలు పొందే ప్రజాసేవకులు. అయితే, సేవా దృక్పథానికి బదులుగా కొన్నిచోట్ల లంచం, ఆలస్యం, మధ్యవర్తుల వ్యవస్థ, అధికార దుర్వినియోగం వంటి ధోరణులు పాతుకుపోవడం ఆందోళన కలిగించే విషయం. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన గురించి ఎంత చెప్పుకున్నా, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేయకపోతే ఆ అభివృద్ధి సంపూర్ణం కాదు.ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే సాధారణ పౌరుడి అనుభవం తరచూ నిరాశ కలిగిస్తుంది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, భూమి రికార్డులు, భవన అనుమతులు, పెన్షన్లు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు, లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు ఏ పని కోసం వెళ్లినా కొన్నిచోట్ల అనవసర జాప్యం, ఫైళ్ల తిప్పులు, నిబంధనల పేరుతో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. చట్టబద్ధంగా జరగాల్సిన పనికే కొందరు అధికారులు లేదా మధ్యవర్తులు అక్రమంగా డబ్బు డిమాండ్ చేయడం ప్రజల్లో ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తోంది.అవినీతి అంటే కేవలం లంచం తీసుకోవడమే కాదు. అధికారాన్ని వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించడం, బంధుప్రీతి, పక్షపాతం, ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేయడం, అర్హులైన వారిని పక్కన పెట్టి అనర్హులకు లబ్ధి చేకూర్చడం, ప్రజల సమస్యలను ఉద్దేశపూర్వకంగా పెండింగ్‌లో ఉంచడం కూడా అవినీతిలో భాగమే. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉండాలి. కానీ అవినీతి ఆ సమానత్వాన్ని దెబ్బతీస్తుంది. డబ్బు ఉన్నవారికి వేగంగా సేవలు అందుతుండగా, సాధారణ పౌరుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. జవాబుదారీతనం లోపించడం, ఫిర్యాదులపై వేగంగా చర్యలు తీసుకోకపోవడం, శిక్షల అమలులో జాప్యం, సంక్లిష్టమైన పరిపాలనా విధానాలు, మధ్యవర్తుల ప్రమేయం, రాజకీయ జోక్యం వంటి అంశాలు ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. కొన్నిసార్లు ప్రజలే "పని త్వరగా పూర్తవ్వాలంటే కొంత డబ్బు ఇవ్వాల్సిందే" అనే భావనతో లంచం ఇవ్వడానికి సిద్ధపడటం కూడా ఈ వ్యవస్థను బలపరుస్తోంది.అవినీతి వల్ల కలిగే నష్టం కేవలం ఒక వ్యక్తికే పరిమితం కాదు. అది మొత్తం సమాజంపై ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ ఆదాయం దుర్వినియోగమవుతుంది. ప్రజా ధనం వృథా అవుతుంది. అభివృద్ధి పనుల నాణ్యత దెబ్బతింటుంది. రోడ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు, తాగునీటి పథకాలు వంటి ప్రజా అవసరాల పనులు నాసిరకంగా పూర్తవుతాయి. ఫలితంగా ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం తగ్గిపోతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతుంది.అవినీతి అత్యధికంగా ప్రభావితం చేసేది పేద, మధ్యతరగతి ప్రజలనే. ఒక ధ్రువీకరణ పత్రం కోసం, ఒక పెన్షన్ కోసం లేదా ఒక ప్రభుత్వ పథకం ప్రయోజనం కోసం చిన్న మొత్తంలో అయినా లంచం ఇవ్వాల్సి వస్తే అది వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిపై భారంగా మారుతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల అసలు లక్ష్యం బలహీన వర్గాలకు చేయూత ఇవ్వడం. కానీ అవినీతి కారణంగా ఆ ప్రయోజనాలు అర్హులకు పూర్తిస్థాయిలో చేరకుండా పోతాయి.అయితే గత కొన్నేళ్లలో పరిస్థితుల్లో కొంత సానుకూల మార్పు కూడా కనిపిస్తోంది. డిజిటల్ సేవల విస్తరణ, ఆన్‌లైన్ దరఖాస్తులు, ఈ–ఆఫీస్ వ్యవస్థ, సేవల కాలపరిమితి, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ , ఆన్‌లైన్ చెల్లింపులు, భూ రికార్డుల డిజిటలీకరణ వంటి చర్యలు కొన్ని రంగాల్లో అవినీతి అవకాశాలను తగ్గించాయి. సాంకేతికత వల్ల అధికారులు, ప్రజల మధ్య ప్రత్యక్ష సంబంధం తగ్గడంతో అక్రమ లావాదేవీలకు అవకాశాలు కూడా కొంత మేర తగ్గుతున్నాయి. అయితే సాంకేతికత ఒక్కటే పూర్తి పరిష్కారం కాదు. దాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, పర్యవేక్షించడం కూడా అంతే ముఖ్యం.అవినీతిని అరికట్టడంలో పారదర్శకత అత్యంత కీలకం. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సేవకు సంబంధించిన విధానం, అవసరమైన పత్రాలు, ఫీజులు, నిర్ణీత కాలపరిమితి స్పష్టంగా ప్రజలకు తెలియజేయాలి. ఏ అధికారి వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉందో తెలుసుకునే అవకాశం ఉండాలి. ప్రతి కార్యాలయంలో ఫిర్యాదు వ్యవస్థ సమర్థంగా పనిచేయాలి. ఫిర్యాదు చేసిన వ్యక్తికి ఇబ్బందులు కలగకుండా రక్షణ కల్పించాలి. తప్పు చేసిన అధికారులపై వేగంగా, నిష్పాక్షికంగా చర్యలు తీసుకోవాలి.అవినీతి నిరోధక సంస్థలు మరింత సమర్థంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. దర్యాప్తు సంస్థలకు స్వతంత్రత, అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు కల్పించాలి. చిన్న ఉద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు ఎవరైనా తప్పు చేసినా చట్టం ముందు అందరూ సమానమే అనే సందేశం సమాజానికి వెళ్లాలి. శిక్ష తప్పదనే భావన ఏర్పడితేనే అవినీతి తగ్గుతుంది.ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత కూడా ఎంతో కీలకం. ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఉపాధి కాదు; అది ప్రజల పట్ల ఒక బాధ్యత. ఒక ఫైల్ వెనుక ఒక కుటుంబం ఆశ ఉంటుంది. ఒక సంతకం వెనుక ఒక విద్యార్థి భవిష్యత్తు ఉండవచ్చు. ఒక అనుమతి వెనుక ఒక రైతు జీవితం ఉండవచ్చు. ఈ విషయాన్ని ప్రతి ఉద్యోగి గుర్తుంచుకోవాలి. నిజాయితీ, సేవా దృక్పథం, సమయపాలన, బాధ్యతాయుతమైన ప్రవర్తన ప్రజాసేవకుడి ప్రధాన లక్షణాలు కావాలి.ప్రజల పాత్ర కూడా అంతే ముఖ్యమైనది. లంచం ఇవ్వకుండా చట్టబద్ధమైన మార్గాల్లో తమ హక్కులను సాధించేందుకు ప్రయత్నించాలి. అవినీతి జరిగినప్పుడు భయపడకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలి. సమాచార హక్కు చట్టం , ప్రజా ఫిర్యాదు వ్యవస్థలు, ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. సమాజం అవినీతిని సహజంగా స్వీకరించడం మానేసినప్పుడే మార్పు వేగవంతమవుతుంది.రాజకీయ నాయకత్వం కూడా ఆదర్శంగా నిలవాలి. పాలనలో పారదర్శకత, ప్రజా ధన వినియోగంలో జవాబుదారీతనం, టెండర్లలో నిష్పాక్షికత, నియామకాల్లో న్యాయం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజాప్రతినిధులు తమ ప్రవర్తన ద్వారా ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంచాలి. అవినీతిపై రాజీ లేని వైఖరి ప్రభుత్వ విధానంగా మారాలి.పాఠశాల స్థాయి నుంచే నైతిక విలువలు, పౌర బాధ్యత, నిజాయితీ వంటి అంశాలను విద్యలో భాగం చేయాలి. చట్టం భయంతో కాకుండా విలువలతో కూడిన సమాజం ఏర్పడితేనే అవినీతి శాశ్వతంగా తగ్గుతుంది. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి నిజాయితీని ఒక జీవన విలువగా పిల్లల్లో పెంపొందించాలి.భారతదేశం ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటి. భారీ పెట్టుబడులు, ఆధునిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ సేవలు, పారిశ్రామిక వృద్ధి వంటి రంగాల్లో దేశం ముందుకు సాగుతోంది. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి కొనసాగితే ఈ అభివృద్ధి ఫలితాలు ప్రతి పౌరుడికి సమానంగా చేరవు. ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం. ఆ విశ్వాసాన్ని కాపాడుకోవడం ప్రభుత్వాల, అధికారుల, ప్రజల ఉమ్మడి బాధ్యత.అవినీతి అనేది కేవలం చట్టపరమైన నేరం మాత్రమే కాదు; అది సమాజ నైతిక విలువలను దెబ్బతీసే సామాజిక వ్యాధి. దీనిని నిర్మూలించేందుకు కఠినమైన చట్టాలు, సమర్థమైన అమలు, ఆధునిక సాంకేతికత, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యం ఈ ఐదు అంశాలు కలిసి పనిచేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు భయపెట్టే ప్రదేశాలుగా కాకుండా, ప్రజల సమస్యలకు వేగంగా పరిష్కారం అందించే సేవా కేంద్రాలుగా మారినప్పుడే సుపరిపాలన సాకారమవుతుంది.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ కార్యాలయం ఒక పౌరుడికి మొదటి ఆశ్రయం. అక్కడ అతనికి గౌరవం, న్యాయం, సమానత్వం, పారదర్శకత లభించాలి. లంచం కాదు, చట్టమే నిర్ణయించాలి. పరిచయాలు కాదు, అర్హతే ప్రాధాన్యం పొందాలి. ఆలస్యం కాదు, సమయపాలనే పరిపాలనకు గుర్తుగా నిలవాలి. అప్పుడు మాత్రమే అవినీతి రహిత భారతదేశం అనే లక్ష్యం నినాదంగా కాకుండా వాస్తవంగా మారుతుంది.

# మారుతున్న తరం...

ప్రతి తరం సమాజానికి ఒక కొత్త దిశను చూపిస్తుంది. కాలం మారిన కొద్దీ మనుషుల ఆలోచనా విధానం, జీవనశైలి, విలువలు, ఆశయాలు కూడా మారుతుంటాయి. నేడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన తరం జెన్–జీ . సుమారు 1997 నుంచి 2012 మధ్య జన్మించిన వారిని ఈ తరానికి చెందినవారిగా పరిగణిస్తారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా, కృత్రిమ మేధ , డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి పరిణామాల మధ్య పెరిగిన ఈ తరం, గత తరాలతో పోలిస్తే పూర్తిగా భిన్నమైన ఆలోచనా విధానాన్ని కలిగి ఉంది. అందుకే జెన్–జీ గురించి ఒకవైపు ప్రశంసలు వినిపిస్తుంటే, మరోవైపు విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. అయితే వారిని విమర్శించే ముందు వారు ఎదిగిన పరిస్థితులను అర్థం చేసుకోవడం అవసరం.నేటి యువత పుట్టుకతోనే డిజిటల్ ప్రపంచాన్ని చూసింది. పాఠ్యపుస్తకాల కంటే ముందు మొబైల్ స్క్రీన్‌ను చూసిన తరం ఇదే. సమాచారాన్ని సేకరించడానికి గ్రంథాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ప్రపంచ విజ్ఞానాన్ని చేతిలోని ఫోన్‌లో పొందగలుగుతోంది. ఈ సాంకేతిక పరిజ్ఞానం వారి ఆలోచనలను వేగవంతం చేసింది. సమస్యలకు తక్షణ పరిష్కారాలను వెతకడం, కొత్త విషయాలను నేర్చుకోవడం, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను తెలుసుకోవడం వీరికి సహజంగా మారిపోయింది.అయితే, జెన్–జీని కేవలం మొబైల్‌కు బానిసైన తరంగా చిత్రీకరించడం సరైనది కాదు. ఈ తరం సృజనాత్మకతకు, ఆవిష్కరణలకు ప్రతీక. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, డిజిటల్ వ్యాపారాలు, స్టార్టప్‌లు, ఫ్రీలాన్సింగ్, కంటెంట్ క్రియేషన్ వంటి రంగాల్లో లక్షలాది మంది యువత స్వయం ఉపాధిని సృష్టించుకుంటున్నారు. గతంలో ఉద్యోగం అంటే ప్రభుత్వ ఉద్యోగం లేదా పెద్ద కంపెనీలో స్థిర ఉద్యోగం మాత్రమే అనుకునే పరిస్థితి ఉండేది. కానీ జెన్–జీ యువత ఉద్యోగం అంటే కేవలం జీతం కాదని, తమ ప్రతిభకు వేదికగా భావిస్తోంది. సృజనాత్మకత, స్వేచ్ఛ, సమతుల్య జీవనం, వ్యక్తిగత అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది.ఈ తరం సామాజిక సమస్యల పట్ల కూడా చైతన్యాన్ని కనబరుస్తోంది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులు, మహిళా సాధికారత, లింగ సమానత్వం, మానసిక ఆరోగ్యం, మానవ హక్కులు వంటి అంశాలపై బహిరంగంగా మాట్లాడుతోంది. సోషల్ మీడియాను కేవలం వినోద సాధనంగా కాకుండా, సామాజిక మార్పుకు వేదికగా కూడా ఉపయోగిస్తోంది. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా దానిపై స్పందించే స్వభావం ఈ తరంలో కనిపిస్తోంది. ఇది ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన పరిణామం.అయితే ప్రతి మార్పు కొన్ని సవాళ్లను కూడా తీసుకొస్తుంది. జెన్–జీ జీవితంలో అత్యంత పెద్ద సమస్య డిజిటల్ ఆధారపడటం. రోజులో అనేక గంటలు మొబైల్ ఫోన్, సోషల్ మీడియా, వీడియో గేమ్స్, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో గడపడం వల్ల ప్రత్యక్ష మానవ సంబంధాలు తగ్గుతున్నాయి. కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోతోంది. స్నేహం కూడా ఇప్పుడు ఎక్కువగా ఆన్‌లైన్‌కే పరిమితమవుతోంది. వేలాది మంది సోషల్ మీడియా స్నేహితులు ఉన్నప్పటికీ, నిజమైన కష్ట సమయంలో తోడుగా నిలిచే స్నేహితులు తక్కువగా ఉండటం ఒక విషాదకర వాస్తవం.సోషల్ మీడియా మరో ప్రమాదకరమైన ధోరణిని కూడా పెంచుతోంది. ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకునే అలవాటు పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని విజయాలను మాత్రమే సోషల్ మీడియాలో పంచుకోవడంతో, వాటిని చూసే యువతలో అసంతృప్తి పెరుగుతోంది. "నేను వెనుకబడి పోతున్నానా?", "నా జీవితం ఎందుకు ఇలా లేదు?" అనే భావనలు మానసిక ఒత్తిడికి దారితీస్తున్నాయి. ఈ కారణంగా ఆందోళన, నిరాశ, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి సమస్యలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి.జెన్–జీ గురించి తరచూ వినిపించే మరో విమర్శ ఏమిటంటే, వీరికి సహనం తక్కువ అని. వేగవంతమైన డిజిటల్ ప్రపంచంలో పెరిగినందున ప్రతిదీ వెంటనే జరగాలని కోరుకోవడం సహజంగా మారింది. ఒక వీడియో కొన్ని సెకన్లలో మారుతుంది. సమాచారం క్షణాల్లో అందుతుంది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక కృషి, ఓర్పు, నిరీక్షణ అవసరమైన రంగాల్లో కొంత అసహనం కనిపించడం సహజం. అయితే ఇది మొత్తం తరానికి వర్తించే లక్షణంగా చూడడం కూడా సరైంది కాదు. సరైన మార్గదర్శకత్వం లభిస్తే ఈ తరం అత్యంత కష్టపడి పనిచేసే సామర్థ్యాన్ని కూడా ప్రదర్శిస్తోంది.ఉద్యోగ రంగంలో జెన్–జీ కొత్త విలువలను తీసుకొచ్చింది. గత తరాల మాదిరిగా జీవితాంతం ఒకే ఉద్యోగంలో కొనసాగాలనే ఆలోచన వీరిలో తక్కువగా కనిపిస్తోంది. పని–జీవిత సమతుల్యత, మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత సంతృప్తి, సంస్థ విలువలు వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. తమ ప్రతిభను గౌరవించని సంస్థల్లో కొనసాగడానికి ఇష్టపడటం లేదు. దీనిని కొందరు బాధ్యతారాహిత్యంగా విమర్శించినప్పటికీ, ఉద్యోగ సంస్కృతిలో మానవీయ విలువలను తీసుకురావడానికి ఈ తరం చేస్తున్న ప్రయత్నంగా కూడా చూడవచ్చు.భారతదేశం ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా కలిగిన దేశాల్లో ఒకటి. ఈ యువశక్తిలో ప్రధాన భాగం జెన్–జీకే చెందుతుంది. దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సాంకేతిక ఆవిష్కరణలు, పరిశోధనలు, పారిశ్రామిక రంగం భవిష్యత్తు ఈ తరంపైనే ఆధారపడి ఉంది. కాబట్టి వీరిని విమర్శించడం కన్నా వారి సామర్థ్యాన్ని గుర్తించి సరైన దిశలో నడిపించడం సమాజ బాధ్యత.ఈ సందర్భంలో కుటుంబ వ్యవస్థ పాత్ర అత్యంత కీలకం. పిల్లలకు కేవలం విద్య మాత్రమే కాకుండా విలువలు, క్రమశిక్షణ, బాధ్యత, మానవ సంబంధాల ప్రాముఖ్యతను కూడా నేర్పించాలి. తల్లిదండ్రులు పిల్లలతో సంభాషణను పెంచాలి. మొబైల్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించడం కాదు, బాధ్యతాయుతంగా ఉపయోగించే అలవాటును పెంపొందించాలి. పిల్లల సమస్యలను వినడం, వారి అభిప్రాయాలను గౌరవించడం, వారితో స్నేహపూర్వకంగా వ్యవహరించడం ద్వారా కుటుంబం ఒక బలమైన ఆధారంగా నిలవగలదు.విద్యాసంస్థలు కూడా కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా జీవిత నైపుణ్యాలను బోధించాలి. విమర్శనాత్మక ఆలోచన, నాయకత్వ లక్షణాలు, సమస్యల పరిష్కార నైపుణ్యం, భావోద్వేగ నియంత్రణ, డిజిటల్ అవగాహన, ఆర్థిక విజ్ఞానం వంటి అంశాలను విద్యలో భాగం చేయాలి. విద్యార్థులను మార్కుల యంత్రాలుగా కాకుండా సమగ్ర వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత విద్యాసంస్థలపై ఉంది.ప్రభుత్వం కూడా యువత కోసం నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ ప్రోత్సాహం, పరిశోధన, ఉపాధి అవకాశాల కల్పన, మానసిక ఆరోగ్య సేవల విస్తరణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాలి. గ్రామీణ యువతకు డిజిటల్ మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, శిక్షణ అందితే వారి ప్రతిభ ప్రపంచస్థాయిలో నిలబడగలదు. జెన్–జీ శక్తిని సరైన విధంగా వినియోగిస్తే భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మరింత బలమైన స్థానాన్ని సంపాదించగలదు.అదే సమయంలో జెన్–జీ కూడా కొన్ని విషయాలను గుర్తుంచుకోవాలి. సాంకేతికత ఒక గొప్ప సాధనం. కానీ అది జీవితానికి ప్రత్యామ్నాయం కాదు. సోషల్ మీడియా గుర్తింపు నిజమైన విజయానికి కొలమానం కాదు. కుటుంబ బంధాలు, స్నేహాలు, సమాజంతో అనుబంధం, పుస్తకాల పఠనం, ప్రకృతితో సాన్నిహిత్యం, శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత ఇవన్నీ సమతుల్య జీవితానికి అవసరం. వేగం ఎంత ముఖ్యమో, దిశ కూడా అంతే ముఖ్యమని ఈ తరం గుర్తించాలి.నేడు ప్రపంచం వేగంగా మారుతోంది. కృత్రిమ మేధ, ఆటోమేషన్, రోబోటిక్స్ వంటి సాంకేతిక మార్పులు ఉద్యోగాల స్వరూపాన్నే మార్చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో నిరంతరం నేర్చుకునే స్వభావం ఉన్నవారే విజయం సాధిస్తారు. అదృష్టవశాత్తూ, జెన్–జీకి కొత్త విషయాలను వేగంగా నేర్చుకునే సామర్థ్యం ఉంది. అదే వారి అతిపెద్ద బలం. ఈ బలాన్ని సరైన దిశలో ఉపయోగిస్తే వారు తమ జీవితాలను మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును కూడా మార్చగలరు.ఒక తరాన్ని పూర్తిగా మంచి లేదా పూర్తిగా చెడు అని వర్గీకరించడం సాధ్యం కాదు. ప్రతి తరానికి తనదైన బలాలు, బలహీనతలు ఉంటాయి. నేటి పెద్దలు తమ కాలంలోని విలువలను జెన్–జీపై బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయకుండా, వారి ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవాలి. అదే విధంగా యువత కూడా అనుభవానికి విలువ ఇవ్వాలి. తరాల మధ్య సంభాషణ పెరిగితేనే సమాజంలో ఆరోగ్యకరమైన మార్పు సాధ్యమవుతుంది.జెన్–జీ భారతదేశ భవిష్యత్తు మాత్రమే కాదు, వర్తమానం కూడా. వారి చేతుల్లో సాంకేతిక నైపుణ్యం ఉంది. ప్రపంచ దృష్టి ఉంది. కొత్త ఆలోచనలు ఉన్నాయి. సృజనాత్మకత ఉంది. అదే సమయంలో వారికి విలువలు, బాధ్యత, సామాజిక చైతన్యం, మానవీయ దృక్పథం కూడా తోడైతే వారు ప్రపంచాన్ని మరింత మెరుగైన దిశలో నడిపించగలరు.అందుకే జెన్–జీని విమర్శించే ముందు వారిని అర్థం చేసుకోవాలి. వారిని మార్చాలని ప్రయత్నించే ముందు సమాజం కూడా తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలి. ప్రతి తరం తన కాలానికి తగిన సవాళ్లను ఎదుర్కొంటుంది. జెన్–జీ ఎదుర్కొంటున్న సవాళ్లు భిన్నమైనవి. వాటిని అధిగమించడానికి కుటుంబం, విద్యా వ్యవస్థ, ప్రభుత్వం, సమాజం, యువత---అందరూ కలిసి పనిచేయాలి. అప్పుడు మాత్రమే ఈ తరం భారతదేశాన్ని జ్ఞాన సమాజంగా, ఆవిష్కరణల కేంద్రంగా, సమాన అవకాశాల దేశంగా తీర్చిదిద్దగలదు. అదే నిజమైన అభివృద్ధికి పునాది అవుతుంది.

# రైతు సంక్షేమమే దేశ సంక్షేమం

భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. దేశ జనాభాలో గణనీయమైన వర్గం ఇప్పటికీ వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తోంది. కోట్లాది ప్రజలకు ఆహారాన్ని అందించే రైతు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. అయినప్పటికీ, అన్నదాత జీవితం నేటికీ అనేక సమస్యలతో సతమతమవుతోంది. దేశానికి ఆహార భద్రతను కల్పిస్తున్న రైతు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధి అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.వ్యవసాయం ప్రకృతిపై ఆధారపడిన రంగం. వర్షాలు సకాలంలో కురిస్తే రైతు ముఖంలో ఆనందం కనిపిస్తుంది. కానీ అనావృష్టి, అతివృష్టి, తుఫాన్లు, వడగళ్ల వానలు వంటి ప్రకృతి వైపరీత్యాలు రైతు ఆశలను ఒక్కసారిగా ఛిద్రము చేస్తాయి. ఇటీవల వాతావరణ మార్పుల ప్రభావం మరింత పెరగడంతో రైతులు అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పంటల దిగుబడి తగ్గడం, పెట్టుబడులు పెరగడం, నష్టాలు రావడం వంటి సమస్యలు సాధారణమైపోయాయి.రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో గిట్టుబాటు ధరల కొరత ఒకటి. పంట పండించడానికి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కార్మిక వ్యయం వంటి ఖర్చులు పెరుగుతున్నప్పటికీ, మార్కెట్‌లో సరైన ధర లభించకపోవడం రైతును ఆర్థికంగా బలహీనపరుస్తోంది. అనేక సందర్భాల్లో మధ్యవర్తులే ఎక్కువ లాభాలు పొందుతుండగా, అసలు ఉత్పత్తిదారుడైన రైతుకు తగిన ఆదాయం అందడం లేదు. ఫలితంగా రైతు అప్పుల ఊబిలో చిక్కుకునే పరిస్థితి ఏర్పడుతోంది.అప్పుల భారం రైతు జీవితంలో మరో పెద్ద సవాలు. పంట నష్టపోతే అప్పులు తీర్చడం కష్టమవుతుంది. బ్యాంకులు, ప్రైవేట్ రుణదాతల వద్ద తీసుకున్న అప్పులు రైతులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ పరిస్థితులు కొన్ని సందర్భాల్లో రైతు కుటుంబాలను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నాయి. వ్యవసాయం లాభసాటిగా మారకపోతే యువత ఈ రంగం వైపు ఆకర్షితులు కాకపోవడం కూడా ఆందోళన కలిగించే అంశం.అయితే వ్యవసాయ రంగంలో ఆశాజనక మార్పులు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఆధునిక సాంకేతికత, డ్రిప్ ఇరిగేషన్, యాంత్రీకరణ, సేంద్రియ వ్యవసాయం, డ్రోన్ల వినియోగం వంటి పద్ధతులు రైతులకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి. వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా, శాస్త్రీయంగా మార్చేందుకు ప్రభుత్వం, పరిశోధనా సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వాలు రైతుల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నప్పటికీ, వాటి ప్రయోజనాలు ప్రతి రైతుకు సమర్థవంతంగా చేరడం ముఖ్యం. పంట బీమా, సాగునీటి సదుపాయాలు, కనీస మద్దతు ధర, తక్కువ వడ్డీ రుణాలు వంటి కార్యక్రమాలు రైతులకు భరోసా కల్పించాలి.

అలాగే నిల్వ గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, మార్కెటింగ్ సదుపాయాలు పెరిగితే రైతులు తమ ఉత్పత్తులను సరైన సమయంలో విక్రయించి మంచి ధర పొందగలరు.సమాజం కూడా రైతు పట్ల తన బాధ్యతను గుర్తించాలి. మనం ప్రతిరోజూ తినే అన్నం వెనుక రైతు కష్టం, చెమట, ఆశలు దాగి ఉంటాయి. ఆహారాన్ని వృథా చేయకుండా ఉండటం, రైతు శ్రమకు గౌరవం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత. రైతు అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం బలపడుతుంది.రైతు కేవలం ఒక వృత్తిదారుడు కాదు; దేశ ఆహార భద్రతకు కాపలాదారు.

ఆయన సంక్షేమం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. అందుకే రైతు సమస్యలను తాత్కాలిక రాజకీయ అంశంగా కాకుండా జాతీయ ప్రాధాన్యతగా చూడాలి. రైతుకు ఆర్థిక భద్రత, గిట్టుబాటు ధర, సాంకేతిక సహాయం, మార్కెట్ అవకాశాలు కల్పించినప్పుడే వ్యవసాయ రంగం బలోపేతం అవుతుంది.దేశాన్ని పోషించే రైతు సంతోషంగా ఉన్నప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. రైతు చేతిలో లాభం ఉంటేనే వ్యవసాయం నిలదొక్కుకుంటుంది. వ్యవసాయం బలపడితేనే దేశం ఆర్థికంగా, సామాజికంగా మరింత పురోగతి సాధిస్తుంది. అందువల్ల రైతు సంక్షేమమే దేశ సంక్షేమమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల్సిన అవసరం ఉంది.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# పైసలిస్తేనే కలిసేది!

## అధికార పార్టీ ముఖ్య నేత గన్‌మెన్ల వసూళ్ల పర్వం

**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** అధికార పార్టీలో సుదీర్ఘ కాలంగా ఉంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ ముఖ్య నేత పరువును ఆయన గన్‌మెన్లు బజారున పడేస్తున్నారు. నాయకుడి మెప్పు పొంది బాధ్యతగా పనిచేయడం మాని నేతను కలవడానికి వచ్చే వారి వద్ద వసూళ్లకు పాల్పడుతుండడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాము అధికార పార్టీలో ఉన్నామనే ధీమాతో సదరు గన్‌మెన్లు విర్రవీగుతున్నారని, డబ్బులు ఇస్తేనే నాయకుడి దగ్గరకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తూ, లేదంటే గేటు బయటే ఆపేస్తున్నారని కార్యకర్తలు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ముందుగా 'ఎంట్రీ ఫీజు' కట్టాల్సిందే...**

సదరు ముఖ్య నేత వద్ద ఏ చిన్న పని కావాలన్నా, నియోజకవర్గ సమస్యలపై ఫిర్యాదు ఇవ్వాలన్నా ముందుగా గన్‌మెన్లకు 'ఎంట్రీ ఫీజు' చెల్లించాల్సిందేనని పలువురు నాయకులు వాపోతున్నారు. డబ్బున్న వారికే ప్రాధాన్యం ఇస్తూ పార్టీ కోసం కష్టపడిన క్యాడర్‌ను కనీసం లోపలికి కూడా రానివ్వడం లేదని అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ దందా రోజురోజుకూ పెరిగిపోతుండడంతో సామాన్య కార్యకర్తలు తమ నాయకుడిని కలిసేందుకే జంకుతున్నారు. ఈ మొత్తం వ్యవహారం సదరు ముఖ్య నేతకు తెలియకుండానే జరుగుతోందా? లేక ఆయన ప్రమేయంతోనే నడుస్తోందా? అనే అనుమానాలు సొంత పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి.

**పార్టీ ఇమేజ్‌కు భారీ డ్యామేజ్...**

గన్‌మెన్లు ఎవరిని లోపలికి పంపాలి, ఎవరిని ఆపాలో వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పైస్థాయి నాయకత్వం స్పందించకపోవడంపై క్యాడర్ గుసగుసలాడుతోంది. ఇది ఇలాగే కొనసాగితే 'ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు' అన్న పేరు పోయి, 'పైసలిస్తేనే కలిసే నాయకుడు' అన్న ముద్ర పడుతుందని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ వసూళ్ల రాజకీయం వల్ల ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజల్లో కూడా వ్యతిరేకత మొదలైంది. గన్‌మెన్ల అరాచకాలు ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా విమర్శలకు దారితీస్తుండడంతో సీనియర్ నాయకులు తలపట్టుకుంటున్నారు.

**ప్రతిపక్షాలకు అస్త్రం.. నేత జోక్యం అత్యవసరం..**

ఈ వసూళ్ల వ్యవహారాన్ని ప్రతిపక్షాలు నిశితంగా గమనిస్తున్నాయని, రాబోయే రోజుల్లో దీనిని 'అవినీతి, వసూళ్ల రాజకీయం' పేరుతో ప్రధాన అస్త్రంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నాయని తెలుస్తోంది. పార్టీ ప్రతిష్ట దెబ్బతినక ముందే సదరు ముఖ్య నేత వెంటనే జోక్యం చేసుకుని ఈ వసూళ్ల సంస్కృతికి చెక్ పెట్టాలని, అక్రమాలకు పాల్పడుతున్న గన్‌మెన్లను తక్షణమే మార్చాలని పార్టీ శ్రేణులు గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో సదరు నేతతోపాటు పార్టీకి కూడా భారీ నష్టం తప్పదని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# నోటీసులు ఇచ్చారా..?

**పేట్ బషీరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ భూమిలో వెలుస్తున్న భారీ అక్రమ కట్టడం వ్యవహారంలో రెవెన్యూ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. ఈ ఆక్రమణపై స్వయంగా కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో పేట్ బషీరాబాద్ సర్వే నంబర్ 5లో జరుగుతున్న నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నోటీసులు ఇవ్వాలని కొన్ని రోజుల క్రితమే ఆదేశించినా.. కింది స్థాయి సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు బీజం వేస్తోంది. ముఖ్యంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ మాటల తీరు, నోటీసుల జారీలో ఆయన వ్యవహరించిన శైలిపై అనుమానాలు కలగక మానదు.

**సార్.. "సర్" లో బిజీ.. అంటూ దాటవేత**

సర్ విధులు రాకముందే సర్వే నెంబర్ 5 అంశంలో నోటీసులు ఇవ్వడానికి సిద్ధమయ్యారు రెవెన్యూ అధికారులు. అక్రమ కట్టడం పై నోటీసులు ఇచ్చి పనులు నిలుపుదల చేయించాల్సిన ఆర్ఐ.. రోజులుగా నోటీసులు ఇవ్వకుండా కాలయాపన చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై పలుమార్లు ఆయనకు ఫోన్ చేసినప్పటికీ, తాను "సర్" విధుల్లో బిజీగా ఉన్నానని చెబుతూ దాటవేస్తూ వచ్చారు. పలుమార్లు ఈ అంశం పై వివరణ కోసం ప్రయత్నించగా బిజీగా ఉన్నా అని మళ్ళీ మాట్లాడతానని చెప్పుకొచ్చిన ఆయన ఇప్పుడు మాత్రం నోటీసులు ఇచ్చేశానని ఆర్ఐ చెబుతున్నారు. అయితే, ఇచ్చిన నోటీసును బహిర్గతం చేయడానికి మాత్రం వెనకడుగు వేశారు.

**కాపీ అడిగితే జంకుతున్నారెందుకు?**

నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమే అయితే, ఆ కాపీని చూపించడానికి ఆర్ఐ ఎందుకు వెనకడుగు వేస్తున్నారనేది ఇప్పుడు ప్రధాన ప్రశ్న. నోటీసు కాపీని అడిగితే.. ఎమ్మార్వో సార్‌ను అడగాలంటూ ఆర్ఐ దాటవేస్తున్నారు. కాపీని బయట పెట్టడానికి అధికారి ఎందుకు జంకుతున్నారు? అసలు నోటీసులు నిజంగానే ఇచ్చారా? లేక పై అధికారుల కళ్లుగప్పేందుకు ఇచ్చినట్లుగా చెబుతున్నారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పారదర్శకంగా వ్యవహరించాల్సిన రెవెన్యూ అధికారి ఇలా దాపరికానికి పోవడం పలు విమర్శలకు దారి తీస్తోంది.

**ఆర్ఐ వింత వాదన..**

నోటీసు కాఫీ బహిర్గతం చేయడానికి ఇబ్బంది ఏమైనా ఉన్నదా అని ప్రశ్న వచ్చినప్పుడు ఆర్ఐ మాట్లాడిన తీరు విస్మయానికి గురి చేస్తోంది. ఆ అంశం పబ్లిక్ కాదు అంటూ, ప్రభుత్వ భూముల కబ్జాలపై స్పందిస్తూ "గవర్నమెంట్ అంటే పబ్లిక్ కాదు.. అది గవర్నమెంట్ ది.. పబ్లిక్ ది ఎట్లా అవుతుంది?" అంటూ ఆర్ఐ వింతగా వాదం చేశారు. ప్రభుత్వ భూములు, నిధులు, వనరులు అన్నీ అంతిమంగా ప్రజలందరి ఉమ్మడి సంపద. ప్రభుత్వం కేవలం వాటికి సంరక్షకురాలిగా మాత్రమే వ్యవహరిస్తుంది. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 లోని సెక్షన్ 74 (భారతీయ సాక్ష్య అధినియం, 2023) ప్రకారం, ప్రభుత్వ అధికారుల శాసన, న్యాయ, కార్యనిర్వాహక హోదాలో చేసిన అధికారిక చర్యలు లేదా వాటికి సంబంధించిన రికార్డులు పబ్లిక్ డాక్యుమెంట్లుగా పరిగణించబడతాయి. అందువల్ల, వారు అధికారిక హోదాలో జారీ చేసే ఉత్తర్వులు, నోటీసులు, ప్రొసీడింగ్స్, ఇతర అధికారిక రికార్డులు సాధారణంగా పరిధిలోకి వ స్తాయి. మరి పెట్ బషీరాబాద్ సర్వేనెంబర్ ఐదు ప్రభుత్వ భూమి వ్యవహారంలో ఒక ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారానికి సంబంధించిన నోటీసును దాచటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్న ఈ వ్యవహారంపై పై అధికారులు దృష్టి సారించి, అక్రమ కట్టడం పై తీసుకున్న చర్యలను పారదర్శకంగా బయటపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# కనీస అవగాహన లేకుండా పాలిస్తున్నారు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డి నీచమైన బాషను పక్కనపెట్టి సాగునీరు, తాగు నీరు అందించే చర్యలు తీసుకోవాలని అన్నారు. సుందిళ్ళ, అన్నారం బ్యారేజీలకు 2024లోనే మరమ్మత్తులు చేసినట్టు ఎన్డీఎస్ఏ రిపోర్ట్ చెబుతోందని అన్నారు. ఇది చెబుతోందని ఎన్డీఎస్ఏనే కాబట్టి వెంటనే సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నీళ్ల స్టోరేజీ పెట్టుకోవాలని సూచించారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతాంగం ఆందోళన చెందుతోందని, తాగు నీళ్ల లేక కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. కనీస అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి పాలన సాగి స్తున్నారని మండిపడ్డారు. హరీష్ రావు, కేసీఆర్, కేటీఆర్ ఉన్న ఖిలాడీ కమిటీలో ఈటల చేరారు అని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖిలాడీ ఈటలనా రేవంత్ రెడ్డా అనేది తెలంగాణ సమాజం నిర్ణయిస్తుందని అన్నారు. రేవంత్ రెడ్డి హెడ్ లైన్స్ కోసం మాట్లాడే వ్యక్తి అని విమర్శించారు. రేవంత్ రెడ్డి కేవలం రాజకీయకోణంలో మాట్లాడతారని, ప్రజల కోణంగా మాట్లాడరని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఎన్ డిఎస్ఏ పై ఇంజనీర్లతో సమావేశమై చర్చించాలని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగితే వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# 'సర్'.. సమస్యలు!

**వరంగల్,ఫ్లాష్ ఇండియా :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ(ఎస్ఐఆర్)ఓటర్లలో గందరగోళానికి దారితీస్తోంది. ఓటరు సవరణలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు అందరికీ పంపిణీ చేసిన బీఎల్‌వోలు డిజిటలైజేషన్ సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. పాత ఓటర్ల జాబితా కోసం తిప్పలు పడుతున్నారు. మహిళలు, ముఖ్యంగా కోడళ్లుగా ఇతర ఇళ్లకు వెళ్లిన వారు వారి తల్లిదండ్రుల వివరాల ఎంట్రీ సమయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. సర్ కు సంబంధించి 2002 ఓటరు జాబితాలో పూర్తి వివరాలు లేకపోవడం కొంతమంది తల్లిదండ్రులు చనిపోవడంతో వివరాలు దొరకక డిజిటలైజేషన్ ప్రక్రియ ఆలస్యమవుతుంది. ఇంకా పది రోజులే సమయం ఉండటంతో ఉరుకులు పరుగుల మీద బీఎల్వోలు బీఎల్ఏలతో కలిసి డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

**ఇంటింటికి బీఎల్ఓలు..**

ఉమ్మడి జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ జూన్ 25న మొదలైంది. బీఎల్ఓలు ఇంటింటికి తిరగడంతో పాటు పోలింగ్ స్టేషన్ల వారీగా ఉమ్మడి జిల్లా పరిధిలోని 12 నియోజకవర్గాలకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్, స్టేషన్ ఘన్‌పూర్, జనగామ, పాలకుర్తి, వర్ధన్నపేట, మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. ఆరు జిల్లాల పరిధిలో ఈ నియోజకవర్గాలు ఉన్నాయి. హన్మకొండ జిల్లా పరిధిలో 5లక్షల 9వేల 14 మంది ఓటర్లు, వరంగల్ జిల్లా పరిధిలో 7లక్షల 76 వేల 953 ఓటర్లు, జనగామ జిల్లా పరిధిలో 7లక్షల 87వేల 483 ఓటర్లు, మహబూబాబాద్ జిల్లా పరిధిలో 4లక్షల 84వేల 932 ఓటర్లు, భూపాలపల్లి జిల్లా పరిధిలో 2లక్షల 77వేల 882 ఓటర్లు, ములుగు జిల్లా పరిధిలో 2లక్షల 38 వేల 970 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికి మొదట బీఎల్ఓలు ఇండ్లను గుర్తించడంతో పాటు ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్ఏలతో కలిసి అందజేశారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత డిజిటలైజేషన్ ప్రక్రియ మొదలు కాగానే అసలు సమస్యలు మొదలయ్యాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 30 లక్షల 53వేల 938 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 15 లక్షల వరకు డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మిగతా వారి ప్రక్రియను బీఎల్ఓలు, సూపర్ వైజర్లు, బీఎల్ఏల ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. నిత్యం జిల్లా కలెక్టర్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్లు పోలింగ్ బూత్ ల వారీగా పర్యటిస్తూ ఎక్కడైతే ఆలస్యం జరుగుతుందో అక్కడ బీఎల్ఓలకు అసిస్టెంట్లను నియమిస్తూ త్వరగా ప్రక్రియ పూర్తయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో గ్రామాల వారీగా సమీక్షిస్తూనే త్వరగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు సిద్ధవవుతున్నారు.

**డిజిటలైజేషన్‌లో సమస్యలు..**

డిజిటలైజేషన్ ప్రక్రియలో లింక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. పురుష ఓటర్లకు సంబంధించి ఎక్కువ సమస్యలు రాకున్నా మహిళా ఓటర్లకు సంబంధించి సమస్యలు ఏర్పడుతున్నాయి. పెళ్లిళ్ల తర్వాత మహిళా ఓటర్లు వేరే గ్రామాలకు, వేరే జిల్లాలకు, వేరే రాష్ట్రాలకు వెళ్లారు. అత్తగారింటికి పోయిన మహిళా ఓటర్లు వారి వివరాలను అందించే సమయంలో సమస్యలు అత్యధికంగా వస్తున్నాయి. మహిళలకు సంబంధించి తల్లిదండ్రుల వివరాలను అందించాలని కోరారు. వాటితో పాటు 2002 ఓటరు జాబితాలో వారి పేర్లు ఉన్నాయా వాటి వివరాలను కూడా పొందుపరచాలని కోరారు. కొంత మందికి వివరాలు అందుబాటులో ఉన్న మిగతా వారికి సమస్యలు ఎదురవుతున్నాయి. వారి తల్లిదండ్రులు చనిపోవడం కొంత మందికి ఓటర్లలో పేరు లేకపోవడంతో పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ జరగడం లేదు. కుటుంబంలో పురుష ఓటర్లకు సంబంధించిన ఇబ్బందులు రావడం లేదు. మహిళలకు సంబంధించి పెళ్లికాని యువతులకు ఇబ్బందులు లేవు. తల్లిదండ్రుల వివరాలతో పాటు వారి వివరాలను అందిస్తున్నా పెళ్లి తర్వాత ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారికే సమస్యలు వస్తున్నాయి. కొంత మందికి పేర్లకు సంబంధించిన తంటాలు వస్తున్నాయి. ఎపిక్ కార్డులో పేర్లు తప్పుగా నమోదు కావడం, ఇంటి పేర్లు తేడాలు ఉండడం, తప్పులు ఉండటంతో వివరాల నమోదుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఈ సమస్యలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. ముఖ్యంగా వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్ నియోజకవర్గాల పరిధిలో సమస్యలు ఎదురవుతున్నాయి. వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని పోలింగ్ బూత్ లకు అనుగుణంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరఫరా చేసిన బీఎల్ఓలు వెళ్లిన సమయంలో వారు లేకపోవడం, ఉద్యోగరిత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లడం, తాళం వేసి ఉండటంతో డిజిటలైజేషన్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. ఇదే కాకుండా ఉద్యోగులు ఉదయం, సాయంత్రం వేళల్లోనే అందుబాటులో ఉండటం ఆ సమయంలోనే బీఎల్ఓలు వెళ్లడం సమస్యలు ఎదురవుతున్నాయి. కొన్ని మున్సిపాలిటీల పరిధిలోనూ డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా జరగడం లేదు. కొన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో బీఎల్ఓలు వేగంగా డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగిస్తున్నా మరిన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో మాత్రం వెనుకబడి ఉన్నాయి. ఆ ప్రాంతాల్లో పరిశీలించడంతో పాటు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ముందుకు పోతున్నారు. బీఎల్ఓలు, బీఎల్ఏల ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొన్నిచోట్ల వెనుకబడి ఉండటం కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షించడంతో పాటు త్వరగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంకా పది రోజులే సమయం ఉండటంతో ఆలోపు మిగిలిన ప్రక్రియ పూర్తి చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# సూర్యాపేట జిల్లాలో ఉద్రిక్తత..



**చివ్వేంల,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రక్తంతో పంటలు పండించవచ్చని తెలిపిన దాని ప్రకారం.. సూర్యాపేట జిల్లా చివ్వేంల మండలం సేవాలాల్ తండా గ్రామపంచాయతీ(పంది బండ తండ)లో బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ గుగులోతు కవిత అనిల్ ఆధ్వర్యంలో రైతులు తమ రక్తాన్ని తీసి పంట పొలాల్లో చల్లి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రైతు గుగులోతు లాలు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీళ్ల లేకుండా రక్తంతో పంటలు పండించవచ్చని తెలియజేయడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి తమ రక్తాన్ని ముఖ్యమంత్రికి ఇస్తామని వారు రక్తంతో పంటలు ఎలా పండించాలో తెలియజేయాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతులకు వెంటనే క్షమాపణ తెలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుగులోతు వెంకన్న, గుగులోతు మాన్సింగ్, బోడియా, మహిళా రైతులు వీరమ్మ, బుజ్జి, మగ్రు తదితరులు పాల్గొన్నారు.

# మక్కల రైతులకు చెల్లింపుల్లో జాప్యం..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మక్కలు విక్రయించిన రైతన్నలు ఇంకా డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. వానకాలం సీజన్ ప్రారంభమైనా యాసంగి డబ్బులు ఖాతాల్లో జమ కాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మొదట కొనుగోలు చేసిన రైతులకు రూ.5,200 కోట్లు నగదు పంపిణీ చేయగా మరో రూ.250 కోట్లు పెండింగ్‌లోనే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 336 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2,400 చొప్పున 14.80 లక్షల టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసింది. అయితే మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించిన రైతులకు వారం, పదిరోజుల్లోనే డబ్బులు చెల్లించేవారు. కానీ ఈసారి మాత్రం నెల రోజులు దాటినా డబ్బులు జమ కాలేదు. దీంతో పాత బకాయిలు చెల్లించడం, ఇంట్లో రోజువారి ఖర్చులు, పిల్లల స్కూల్ ఫీజులకోసం రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాదు మరుసటి పంట పెట్టుబడి కోసం ఇతరుల వద్ద వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వ్యాపారులు సిండికేట్**

మార్క్‌ఫెడ్ గత 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వేలం నిర్వహించింది. ఈ వేలంలో ప్రభుత్వానికి ఆశించిన ధర రాలేదు. వ్యాపారులు రూ.1900 వరకే వేలం పాట పాడారు. ఈ ధర గిట్టుబాటు కాలేక మరోసారి అధికారులు వేలానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. మక్కల కొనుగోలు కోసం మార్క్ఫెడ్ బ్యాంకు రుణాలు తీసుకోగా ఈ రుణంపై వడ్డీలు, కేంద్రాల ఏర్పాటు, హమాలీ, రవాణా, గోదాముల అద్దెలు, నిల్వ ఖర్చులు కలిపి క్వింటాల్‌కు రూ.2900 వరకు ఖర్చు అయింది. ఈ ధరకు అమ్మితే ప్రభుత్వానికి లాభం రాకున్నా నష్టం ఉండదు. కానీ ఈ ధర రావడం కష్టమని అధికారులు భావిస్తున్నారు. కనీసం రూ.2500 వచ్చిన ఫర్వాలేదనే అంచనాకు వచ్చినట్టు తెలిసింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మక్కలకు మద్దతు ధర ప్రకటించినా ఒక గింజ కొనుగోలు చేయలేదు. ఎకరానికి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా కేంద్రం ఎకరానికి 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసింది. దీంతో మిగతా పంటను రేవంత్రెడ్డి ప్రభుత్వం కొనుగోలు చేసింది.

**ఖమ్మంలోనే అత్యధికం**

ఈ ఏడాదిలో ఖమ్మం జిల్లాలోనే అత్యధికంగా 3 లక్షల మెట్రిక్టన్నుల మక్కలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. నాగర్కర్నూల్ జిల్లాలో 1.70 లక్షల మెట్రిక్టన్నులు, నిర్మల్జిల్లాలో 1.73 లక్షల మెట్రిక్టన్నులు సేకరించారు. వీటిలో సగానికిపైగా మక్కలకు ప్రభుత్వం డబ్బులు చెల్లించగా, చివరి వారంలో కొనుగోలు చేసిన వారికే ఇంకా ఇవ్వలేదు. అధికారులు మాత్రం వేలం ద్వారా వచ్చిన డబ్బులను రైతులకు చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ఇప్పటివరకు చెల్లించిన డబ్బులు కూడా రుణాలు తీసుకుని చెల్లించినవే. ఇంకా అప్పులు తేవడం కష్టమని, కొంత ఆలస్యమైనా వేలం తరువాత వ్యాపారుల నుంచి తీసుకున్న డబ్బులు రైతుల ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాలను షేక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. తాజాగా ఈ కేసులో ఏపీ రిటైర్డ్ ఐపీఎస్ స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. తాజాగా రిటైర్డ్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేశారు. గతంలో ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఏబి వెంకటేశ్వరరావు పని చేశారు. అయితే 2023లో వెంకటేశ్వరరావు కాల్ డేటా రికార్డింగ్స్ ను నిందితులు తీసినట్టు సిట్ అధికారులు గుర్తించారు. దీంతో విట్‌నెస్ కింద వెంకటేశ్వరరావు స్టేట్ మెంట్ రికార్డు చేశారు. అయితే ఈ కేసులో ఇతర రాష్ట్రానికి చెందిన బ్యోరోక్రాట్ ను సిట్ అధికారులు విచారించడం ఇదే మొదటిసారికావడం గమనార్హం.

**అనుబంధ అభియోగ పత్రం సిద్ధం!:**

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తును సిట్ ముగింపునకు చేర్చినట్లు తెలుస్తోంది. గత ఐదున్నర నెలలుగా అహర్నిశలు సాగిన విచారణలో సిట్ అధికారులు సంచలన నిజాలను వెలుగులోకి తెచ్చారు. ఈ కుట్రలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుతో పాటు పలువురు పోలీసు మాజీ అధికారులు, రాజకీయ నేతలపై పక్కా సాక్ష్యాలతో కూడిన తుది చార్జిషీట్ దాఖలు చేసేందుకు కసరత్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. ఈ కేసు నిందితుల జాబితాలో ముగ్గురు బీఆర్ఎస్ ముఖ్యుల్ని చేర్చినట్లు గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పక్క రాష్ట్రానికి చెందిన బ్యూరోక్రాట్ వాంగ్మూలాన్ని నమోదు చేయడంతో ఈ కేసు దర్యాప్తులో ఎలాంటి విషయాలు అంతిమంగా వెలుగులోకి రాబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది.

# వరుణ దేవా కరుణించవా!

## కళ్లముందే ఎండిపోతున్న ఖరీఫ్ పంటలు..




**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని 32 గ్రామపంచాయతీల పరిధిలో అన్నదాత గుండెల్లో ఆందోళన రోజురోజుకూ పెరుగుతోంది. జూన్ నెలలో కురిసిన తొలి జల్లులను నమ్ముకుని లక్షల రూపాయలు అప్పులు చేసి ఖరీఫ్ సాగు ప్రారంభించిన రైతులకు వరుణుడు మొండిచేయి చూపడంతో పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయి. గతేడాది ఇదే సమయానికి మండలమంతా పచ్చని పైర్లతో కళకళలాడగా, ఈసారి ఎక్కడ చూసినా బీటలు వారిన నేలలు, వాడిపోయిన మొక్కలే కనిపిస్తున్నాయి. గతేడాది మండలంలో సుమారు 40 వేల ఎకరాలకు పైగా వివిధ పంటలు సాగు కాగా, ఈసారి రైతుల ఆశలు వర్షాభావంతో బూడిదలో పోసిన పన్నీరుగా మారిపోయాయి.

**తొలకరి ఆశ.. కన్నీటి గాథగా మారింది..**

రెండు మూడు జల్లులు కురవడంతో రైతులు వరి, మొక్కజొన్న, పత్తి, కందులు, వేరుశనగ తదితర పంటలను ఉత్సాహంగా సాగు చేశారు. కానీ ఆ తర్వాత ఆకాశం మేఘాలను దాచేసింది. నేలలో తేమ పూర్తిగా తగ్గిపోవడంతో మొక్కలు పసుపు రంగులోకి మారి ఎండుముఖం పడుతున్నాయి. రోజులు గడిచేకొద్దీ పంటను కాపాడుకోవాలనే ఆశ కూడా రైతుల్లో సన్నగిల్లుతోంది.

**అప్పులు చేసి సాగు.. ఇప్పుడు దిక్కుతోచని స్థితి**

ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసి రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేశారు. బ్యాంకులతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి సాగు ప్రారంభించారు. ఇప్పుడు వర్షాలు లేక పెట్టుబడి మొత్తం నేలలో కలిసిపోతుండటంతో అప్పులు ఎలా తీర్చాలనే ఆందోళన రైతులను వెంటాడుతోంది.

**బీటలు వారుతున్న భూమి వాడిపోతున్న జీవనాధారం**

వర్షాల లేమితో వ్యవసాయ భూములు బీటలు వారుతున్నాయి. బోరు బావుల్లో నీటి మట్టం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఉన్న కొద్దిపాటి నీరు కూడా సాగుకు సరిపోక రైతులు నిస్సహాయంగా తమ పంటలు ఎండిపోతుండడాన్ని చూస్తూ ఉడిపోతున్నారు.

**ఇంకో 10--20 రోజులు వర్షం లేకుంటే... పచ్చదనం కనుమరుగే**

ఇంకా పది నుంచి ఇరవై రోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగితే మండలంలో ప్రస్తుతం కనిపిస్తున్న కొద్దిపాటి పచ్చదనం కూడా పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోతే కుటుంబాల జీవనోపాధి సంక్షోభంలో పడుతుందని వాపోతున్నారు.

**ఒకప్పుడు పచ్చని పొలాలు... నేడు ఎండిన నేలలు**

జూన్, జూలై నెలల్లో పచ్చని పైర్లతో కళకళలాడే తలకొండపల్లి మండలం ఇప్పుడు వెలవెలబోతోంది. ఉమ్మడి పాలమూరు ప్రాంతానికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో వ్యవసాయం పూర్తిగా వర్షాధారమే. సాగునీటి వసతులు పరిమితంగా ఉండటంతో వరుణుడి కరుణే రైతులకు ఆధారం. ఆ కరుణ లేకపోవడంతో అన్నదాతల ఆశలు ఒక్కొక్కటిగా కరిగిపోతున్నాయి.

**గత కరువును గుర్తు చేస్తున్న దృశ్యాలు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న రోజులను తలపించేలా ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా విస్తారంగా వర్షాలు కురవకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ పూర్తిగా దెబ్బతింటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. తొలకరిని చూసి అప్పు తెచ్చాం... ఇప్పుడు భవిష్యత్తే కనిపించడం లేదు. తొలి వర్షాలు పడగానే అప్పులు చేసి విత్తనాలు చల్లాం. ఇప్పుడు పంట ఎండిపోతోంది. తీసుకున్న అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలి" అని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వమే ఆదుకోవాలి**

వర్షాభావాన్ని దృష్టిలో ఉంచుకుని తలకొండపల్లి మండలాన్ని ప్రత్యేకంగా గుర్తించి ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం, రుణాల రీషెడ్యూల్, వడ్డీ మినహాయింపు వంటి ఉపశమన చర్యలను వెంటనే ప్రకటించాలని రైతులు, రైతు సంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.



## రిపోర్టర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఇటీవల అనారోగ్యానికి గురైన మిర్యాలగూడ పట్టణానికి చెందిన 99 టీవీ రిపోర్టర్ గద్దల జయరాజుని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా జయరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడకుండా త్వరగా కోలుకుని తిరిగి విధుల్లోకి రావాలని జయరాజుకు ధైర్యం చెప్పారు. జయరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడి, తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు విలేకరులు ఉన్నారు.

# పెద్దపల్లిలో ఏసీబీ దాడులు..

**పెద్దపల్లి,ఫ్లాష్ ఇండియా :** పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అవినీతి బాగోతం బట్టబయలైంది. శ్రీనివాస్ అనే కాంట్రాక్టరు చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయడానికి అడ్డగోలుగా లంచం డిమాండ్ చేసిన ఓ అవినీతి అధికారి చివరకు అవినీతి నిరోధక శాఖ వలకు చిక్కి విలవిల్లాడాడు. కాంట్రాక్టర్ నుంచి రూ.4 లక్షలకు బేరం రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ పెద్దపల్లి మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో అధికారుల తీరు మొదటి నుంచి వివాదాస్పదంగా ఉంది. లక్ష కొడితేనే ఇంటి పర్మిషన్.. రెండు లక్షలు ఇస్తేనే పనులకు బిల్లులు అన్న చందంగా ఇక్కడి కొందరు అధికారుల తీరు తయారైందన్న విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. సామాన్యుల నుంచి అభివృద్ధి పనులు చేసే కాంట్రాక్టర్ల వరకు ఎవరినీ వదలకుండా ప్రతి పనికీ పైసా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఏసీబీ అధికారుల నిఘా ఉన్నప్పటికీ.. 'మాకేంటి భయం' అన్న కోణంలో మున్సిపల్ ఆఫీస్ అధికారులు బరితెగించి మరీ లంచాలు డిమాండ్ చేయడం గమనార్హం.

**పక్కా సమాచారంతోనే దాడి..**

మున్సిపల్ పరిధిలో జరిగిన ఓ వర్క్ బిల్లును క్లియర్ చేసేందుకు ఏఈ సతీష్.. సదరు కాంట్రాక్టర్ వద్ద భారీగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని బృందం మంగళవారం పక్కా వ్యూహంతో మున్సిపల్ ఆఫీసుపై దాడి చేసింది. బాధితుడి నుంచి రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏఈ సతీష్‌ను అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంటనే ఆయన వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, చేతులకు కెమికల్ టెస్ట్ నిర్వహించి రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ దాడుల వార్త స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడికి సంబంధించిన నిందితుడిని విచారించి అవినీతి నిరోధక శాఖ కోర్టులో హాజరుపరచనున్నారు



## ఎస్ఐఆర్ ఫారాలను డిజిటలైజేషన్ చేయాలి

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** గ్రామాలు, మున్సిపాలిటీలలో ఇంటింటి నుంచి ఎస్ఐఆర్ ఫారాలను సేకరించిన వెంటనే డిజిటలైజేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను ఆదేశించారు. జిల్లాలో గృహ నిర్మాణ శాఖ, ఎస్ఐఆర్ ప్రక్రియ గూర్చి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, గృహ నిర్మాణ అధికారులతో జిల్లా కలెక్టర్ కే. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎవరికి రెండు చోట్ల ఓటు ఉండకుండా అత్యంత పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. బీఎల్ఓలు, సూపర్వైజర్, వార్డు నోడల్ ఆఫీసర్ లు సమన్వయంతో పని చేయాలన్నారు. పట్టణంలో ఏ ఒక్క ఓటు కూడా తప్పిపోకూడదన్నారు. జిల్లాలో ఆయా మండలాల్లో, గ్రామాల్లో లబ్ధిదారులకు అందించి రెండు పడక గదుల్లో నివసిస్తున్న వారి గృహాల్లో విద్యుత్, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అలాగే జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ లను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి డాక్టర్లను ఆదేశించారు.


**సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి..**

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదే విధంగా రాఘవాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

# ఓటు హక్కే మన సర్వసం

## ఓటు మన హక్కు..మన భాధ్యత.. మన గుర్తింపు

సమయం లేదు మిత్రమా...ఓటు హక్కే మన సర్వసం
బిజేపి యువ నాయకుడు
తిరుమణి రాఘవేందర్ గౌడ్



**తలకొండ పల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు అని తిరుమణి రాఘవేందర్ గౌడ్ అన్నారు. వెల్ జాల్ గ్రామ పంచాయతీ లో భవనం లో ప్రజల సౌకర్యార్థం. ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్. ద్వారా (ఎస్ ఐ ఆర్) ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బిజెపి పార్టీ యువనేత తిరమణి రాఘవేందర్ గౌడ్ కోరారు. మీకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్న బిఎల్వో లకు. బి ఎల్ ఎ లకు తెలపాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎన్యూమరేషన్ ఫారాలు అందరు తీసుకొచ్చి బిఎల్వో ద్వారా పూరించి. తమ ఓటు ను కాపాడుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరు ఓటు జాబితా సవరణ కార్యక్రమం సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ఓటు అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని. నిర్లక్ష్యం చేయకుండా పేరు నమోదు. మార్పులు. చేర్పులు. చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు మన బాధ్యత మన గుర్తింపు. కావున ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఎన్యూమరేషన్ ఫామ్స్ తీసుకొని రావాలని తెలిపారు. ఫామ్స్ నింపి ఇవ్వకపోతే మీ ఓటు హక్కు మీరు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు.

# ఎస్ఎఫ్ఎం తెలంగాణ చాప్టర్ సమావేశం విజయవంతం





**ఎల్ బి నగర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సొసైటీ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ (ఎస్ఎఫ్ఎం), తెలంగాణ చాప్టర్, జీన్ సొల్యూషన్స్ ఇండియా సహకారంతో, జూలై 11, 2026న హైదరాబాద్‌లో తమ చాప్టర్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఎం తెలంగాణ అధ్యక్షురాలు డాక్టర్ చిన్మయి రథ, ఎస్ఎఫ్ఎం తెలంగాణ కార్యదర్శి డాక్టర్ షగున్ అగర్వాల్, మరియు జీన్ సొల్యూషన్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టాంగ్ హంగ్ సాంగ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నూతన జన్యు సాంకేతికతలు, ప్రసవపూర్వ నిర్ధారణలో అల్ట్రాసౌండ్ -జన్యుశాస్త్ర అనుసంధానం, మరియు ఎన్ జీ ఎస్/ఏ ఐ-ఆధారిత జన్యు పరీక్షలపై సెషన్‌లతో పాటు, పాత్‌కేర్--జీన్ సొల్యూషన్స్ భాగస్వామ్య ప్రకటన మరియు భారతదేశ ప్రసవపూర్వ పరీక్షల మార్గాన్ని బలోపేతం చేయడంపై ఒక ప్యానెల్ చర్చలు జరిగాయి. ఈ సహకారం అధునాతన ప్రసవపూర్వ జన్యు సంరక్షణను ప్రజలకు మరింత చేరువ చేస్తుంది. సింగపూర్‌లో ప్రధాన కార్యాలయం మరియు హైదరాబాద్‌లో ప్రయోగశాల కార్యకలాపాలు కలిగిన జీన్ సొల్యూషన్స్, భారతదేశం అంతటా అత్యాధునిక జన్యు పరీక్షలకు ప్రాప్యతను విస్తరిస్తూనే ఉంది.




# సింగరేణి పేరుతో రాజకీయాలు చేయొద్దు..

**కొత్తగూడెం,ఫ్లాష్ ఇండియా :** కొత్తగూడెంలోని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తాడిచర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడాన్ని స్వాగతించారు. అయితే కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి బీఆర్ఎస్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తాడిచర్ల-2లో బొగ్గు ఉత్పత్తిని పూర్తిగా సింగరేణి ఉద్యోగులతోనే చేపట్టాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘాలు రెండున్నరేళ్లుగా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కోయగూడెం, సత్తుపల్లి ఓసీ-3తో పాటు ఇతర బొగ్గు బ్లాకులను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రాన్ని కోరారు. సీఎం, డిప్యూటీ సీఎం బొగ్గు బ్లాకుల కేటాయింపులో దొడ్డిదారిన తమవారికి ప్రయోజనం చేకూర్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే కిషన్ రెడ్డి చేపట్టిన "సింగరేణి భరోసా యాత్ర" కార్మికుల కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఎద్దేవా చేశారు.



# ఒరిస్సా టూ గుజరాత్ కు గంజాయి తరలింపు


**గూడూరు,ఫ్లాష్ ఇండియా :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గూడూరు సీఐ వినయ్ కుమార్, ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న మూడు బ్యాగుల్లో మొత్తం 20.898 కిలోల గంజాయి లభించింది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రంలోని బెరహంపూర్ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ నగరానికి తరలిస్తున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.10.44 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన నిందితులను గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన గురు లోకనాథ్ పాత్ర, ఇబ్రాయిన్ ఖాసిం సంధ్వానీగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి ఒక బ్యాగ్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# రోహిత్, కోహ్లీ ఆడటంపై గిల్ ప్రకటన



ఇంగ్లాండ్ తో నేటి నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానుంది. ఇలాంటి నేపథ్యంలో రోకో అభిమానులకు అదిరిపోయే శుభవార్త అందించాడు భారత క్రికెట్ జట్టు కెప్టెన్ గిల్. 2027 వన్డే వరల్డ్ కప్ ప్లాన్ లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఉన్నారని స్పష్టం చేశారు. దక్షిణాఫ్రికాలో ఏ కాంబినేషన్ బెస్ట్.. ఏ ప్లేయర్ హెల్ప్ అవుతారని అంశాలపై చర్చ మొదలైందని.. ఆ దిశగా తాము వర్క్ చేస్తున్నట్లు గిల్ వెల్లడించారు. దశాబ్ద కాలంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇద్దరు కూడా జట్టుకు బ్యాక్ బోన్ గా నిలిచినట్లు గుర్తు చేశారు.ఇక ముందు కూడా వాళ్లు జట్టులో భాగంగానే ఉంటారని ప్రకటించారు. దీంతో 2027 వన్డే వరల్డ్ కప్ లో రోకో కాంబినేషన్ ఉంటుందని సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఈ క్రమంలో అభిమానులు తెగ సంబరపడిపోతున్నారు. ఇది ఇలా ఉండగా భారత్, ఇంగ్లాండ్ మధ్య ఇవాళ మధ్యాహ్నం మూడున్నర గంటలకు తొలి వన్డే ఉండనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, బుమ్రా రీ-ఎంట్రీ ఇవ్వనున్నారు. అంతేకాదు టీ20 సిరీస్ కైవసం చేసుకున్న ఇంగ్లాండ్ పై ప్రతీకారం తీర్చుకునేందుకు కూడా సిద్ధమయ్యారు.

# కోహ్లీ ముంగిట అరుదైన రికార్డులు!



ఇంగ్లాండ్, భారత జట్ల మధ్య నేటి నుంచి 3 వన్డేల సిరీస్ షురూ కానుంది. ఇప్పటికే ఈ రెండు జట్ల మధ్య టీ20 సిరీస్ ముగియగా.. ఇక ఇప్పుడు వన్డేలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీని పలు రికార్డులు ఊరిస్తున్నాయి. ఈ వన్డే సిరీస్ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో కోహ్లీ ముంగిట పలు అరుదైన రికార్డులు ఉన్నాయి.ఇంకో తొమ్మిది పరుగులు చేస్తే ఇంగ్లాండ్ లో అత్యధిక రన్స్ చేసిన భారత ఆటగాడిగా సరికొత్త చరిత్ర సృష్టిస్తారు. అంతేకాదు, 81 పరుగులు రాబడితే, అంతర్జాతీయ క్రికెట్ లో మూడో నెంబర్ లో 16 వేల పరుగులు పరుగులు పూర్తి చేసుకుంటాడు. వన్డేలలో 15 వేల పరుగులు కంప్లీట్ చేయడానికి 203 రన్స్ దూరంలోనే ఉన్నారు కోహ్లీ. అలాగే మరో రెండు సెంచరీలు కొడితే... ఇంగ్లాండ్ జట్టుపై అత్యధిక శతకాలు చేసిన ఇండియన్ ప్లేయర్ గా రికార్డు సృష్టిస్తారు.

# రంగంలోకి ద్రావిడ్ ?



చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన కోచ్ పదవికి రాజీనామా చేస్తూ, చెన్నై సూపర్ కింగ్స్ జట్టుతో బంధం తెంపుకున్నారు. దాదాపు 18 సంవత్సరాలుగా ఆ జట్టుకు సేవలు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్... 2008లో ప్లేయర్ గా కూడా ఆడారు. అనంతరం హెడ్ కోచ్ బాధ్యతలు తీసుకున్నారు. వరుస సీజన్లలో చెన్నై ప్రదర్శన సరిగ్గా లేకపోవడంతో, స్టీఫెన్ ఫ్లెమింగ్ తప్పుకున్నట్లు సమాచారం.

**స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో ఎవరంటే ?**

చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు దూరమైన స్టీఫెన్ ఫ్లెమింగ్ స్థానంలో కొత్త హెడ్ కోచ్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది యాజమాన్యం. ఈ క్రమంలోనే హేమంగ్ బదానీ, బ్రెండన్ మెక్‌కల్లమ్, రవిచంద్రన్ అశ్విన్ లాంటి వాళ్ళ పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ రాహుల్ ద్రావిడ్ కు కోచింగ్ బాధ్యతలు ఇవ్వాలని చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ మీడియాలో సరికొత్త కథనం వైరల్ గా మారింది. ఈ మేరకు రాహుల్ ద్రావిడ్ తో చర్చలు కూడా జరుగుతున్నాయట.




# లార్డ్స్‌లో భారతీయం

ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో టెస్ట్ మ్యాచ్ ఆడాలనేది ప్రతి క్రికెటర్ కల..ఇక ఆ మ్యాచ్‌లో శతకం కొడితే, ఐదు వికెట్లు సాధిస్తే, అన్నింటికీ మించి విజయం అందుకొంటే, అది కూడా అత్యద్భుతమైన భారీ విజయం అయితే..ఇక ఆ క్రీడాకారిణులకు, జట్టుకు అది ఓ జీవితకాల మధురానుభూతి..సరిగ్గా అలాంటి అనుభూతినే అనుభవిస్తోంది హర్మన్‌కౌర్ కెప్టెన్సీలోని భారత్..లార్డ్స్‌లో తొలిసారి జరిగిన మహిళల టెస్ట్‌లో మనోళ్లు ఆతిథ్య ఇంగ్లండ్‌ను ఏకంగా 270 పరుగులతో చిత్తు చేశారు..మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో పేసర్ క్రాంతి గౌడ్ ఐదు వికెట్లతో ప్రత్యర్థిని గడగడలాడిస్తే, రెండో ఇన్నింగ్స్‌లో యాస్తికా భాటియా శతకం చేయడం ఈ టెస్ట్‌లో కీలక ఘట్టాలు..టీ20 ప్రపంచ కప్ గ్రూప్ దశలోనే నిష్క్రమించి నిరాశ పరిచిన టీమిండియా లార్డ్స్‌లో అపురూప విజయంతో దేశ క్రికెట్ అభిమానులకు గర్వకారణంగా నిలిచింది.

లండన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనకు అర్థం చెబుతూ భారత జట్టు అద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రఖ్యాత లార్డ్స్ గ్రౌండ్‌లో చరిత్ర సృష్టించింది. ఇంగ్లండ్‌తో ఏకైక టెస్ట్‌లో 270 పరుగుల ఘన విజయంతో మురిసింది. విజయానికి కావాల్సిన నాలుగు వికెట్లను చివరి రోజు గంటన్నర ఆటలోనే పడగొట్టింది. 457 పరుగుల అలవిమాలిన లక్ష్యంతో..కిందటిరోజు 130/6 స్కోర-ంతో..చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 186 పరుగులకు ఆలౌటైంది. తన ఓవర్‌నైట్ స్కోరు 52కి అమీ జోన్స్ మరో రెండు పరుగులే జోడించి స్నేహ్ రాణా బౌలింగ్‌లో అవుటైంది. మ-రోవైపు క్రాంతి గౌడ్ రెండు క్యాచ్‌లు వదిలేయడాన్ని సద్వినియోగం చేసుకున్న ఎకెల్‌స్టోన్..ఇసీ వాంగ్ (1)తో కలిసి ఇంగ్లండ్ పరాజయాన్ని కొంత ఆలస్యం చేసింది. వాంగ్, లారెన్ బెల్ (0)లను దీప్తీశర్మ బౌల్డ్ చేయగా, అర్ధ శతకం చేసిన ఎకెల్‌స్టోన్‌ను రాణా క్లీన్‌బౌల్డ్ చేసి ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికింది. దాంతో భారత జట్టు సంబరాలు అంబరాన్నంటాయి. క్రాంతి గౌడ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

**స్కోరుబోర్డు**

భారత్ తొలి ఇన్నింగ్స్: 285; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 170;
భారత్ రెండో ఇన్నింగ్స్: 341/7 డిక్లేర్డ్.
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: బౌచియర్ (ఎల్బీ) సత్ఘరే 2, బ్యూమాంట్ (బి) క్రాంతి 0, హీథర్ నైట్ (సి) రిచా (బి) క్రాంతి 13, బ్రంట్ (బి) స్నేహ్ రాణా 11, క్యాప్సీ (బి) సత్ఘరే 21, అమీ జోన్స్ (సి) షఫాలీ (బి) స్నేహ్ రాణా 54, మ్యాడీ విల్లీర్స్ (సి) రిచా (బి) స్నేహ్ రాణా 26, ఎకెల్‌స్టోన్ (బి) స్నేహ్ రాణా 50, ఇసీ వాంగ్ (బి) దీప్తీశర్మ 1, లారెన్ బెల్ (బి) దీప్తీశర్మ 0, లారెన్ ఫైలెర్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు: 4; మె-ంత్తం: 62.5 ఓవర్లలో 186 ఆలౌట్; వికెట్లపతనం: 1-2, 2-6, 3-23, 4-34, 5-59, 6-126, 7-135, 8-157, 9-159, 10-186; బౌలింగ్: సయాలీ సత్ఘరే 10-2-24-2, క్రాంతి గౌడ్ 11-0-54-2, స్నేహ్ రాణా 19.5-4-42-4, శ్రీచరణి 9-2-25-0, దీప్తీశర్మ 12-0-36-2, షఫాలీ 1-0-1-0.

**లార్డ్స్‌లో భారత్ విజయాలు**

(పురుషులు, మహిళలు)
1986లో ఐదు వికెట్లతో (కెప్టెన్ కపిల్)
2014లో 95 పరుగులతో (కెప్టెన్ ధోనీ)
2021లో 151 పరుగులతో (కెప్టెన్ కోహ్లీ)
2026లో 270 పరుగులతో (కెప్టెన్ హర్మన్)

భారత్‌గీఇంగ్లండ్ మహిళల టెస్ట్‌లు
మ్యాచ్‌లు: 16 జూభారత్ గెలుపు: 4
ఇంగ్లండ్ గెలుపు: 1 జూడ్రాలు: 11

# బిజినెస్

## భారీ నష్టాల్లో మార్కెట్లు




హార్మోజ్ జలసంధిలో పెరుగుతున్న దాడులు, పశ్చిమాసియా తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అస్థిరత దేశీయ స్టాక్ మార్కెట్లను కుదిపేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హార్మోజ్ జలసంధిని దిగ్బంధిస్తున్నామని, అక్కడ టోల్ వసూలు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఈ పరిణామాలు భారతీయ మార్కెట్లను తీవ్ర ప్రతికూలతల్లోకి నెట్టడంతో మంగళవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభం నుండే సూచీలు భారీ నష్టాలను చవిచూస్తున్నాయి.

**కుప్పకూలిన ట్రేడ్ మార్కెట్లు**

ఈ అంతర్జాతీయ భయాందోళనల నేపథ్యంలో.. మంగళవారం ఉదయం మార్కెట్ల ప్రారంభ సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 412 పాయింట్లు కుప్పకూలి 77,203 వద్ద ట్రేడవుతోంది. అటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 107 పాయింట్లు నష్టపోయి 24,103 వద్ద కదలాడుతోంది. ముఖ్యంగా చమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశీయ రంగాలైన పెయింట్స్, ఏవియేషన్, టైర్స్ మరియు ఆటోమొబైల్ రంగానికి చెందిన షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.

**రూపాయి మరోసారి ఢమాల్**

మరోవైపు మార్కెట్ల పతనానికి తోడు దేశీయ కరెన్సీ రూపాయి విలువ కూడా భారీగా క్షీణించింది. అంతర్జాతీయంగా డాలర్‌కు డిమాండ్ పెరగడం, చమురు ధరల ఒత్తిడితో అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ ఏకంగా 42 పైసలు పడిపోయి 96.10 వద్ద ఆల్-టైమ్ కనిష్ట స్థాయికి కుంగిపోయింది. పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత ముదిరితే రానున్న రోజుల్లో మార్కెట్లు మరిన్ని ఒడుదొడుకులను ఎదుర్కోవాల్సి వస్తుందని మార్కెట్ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# భారీగా పెరిగిన చెరుకు సాగు

భారతదేశ ఇంధన రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన జు20 - పెట్రోల్ విధానం దేశీయ వ్యవసాయ రంగాన్ని ఊహించని రీతిలో మలుపు తిప్పితోంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ముడి చమురు దిగుమతులను తగ్గించుకునే వ్యూహంతో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 20 శాతం ఎథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని సాధించింది. కాగా, ప్రస్తుత 2026 సంవత్సరం నుండి ఈ E20 ఇంధన విధానాన్ని దేశవ్యాప్తంగా పూర్తి స్థాయిలో అమలు చేస్తుండటంతో ఎథనాల్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. ఇది దేశంలో చెరుకు, మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడానికి ప్రధాన కారణమైంది. ఎథనాల్ తయారీకి అవ-సరమైన ఫీడ్‌స్టాక్ సాగు విస్తీర్ణం గత ఐదేళ్లలో కళ్లు చెదిరే రీతిలో వృద్ధి చెందింది. అధికారిక గణాంకాల ప్రకారం.. 2020-21 ఆర్థిక సంవత్సరంలో కేవలం 0.7 మిలియన్ హెక్టార్లుగా ఉన్న ఎథనాల్ ఫీడ్‌స్టాక్ సాగు విస్తీర్ణం, 2024-25 నాటికి ఏకంగా 56.7 లక్షల హెక్టార్లకు చేరుకుంది.అంటే కేవలం ఐదేళ్లలోనే సాగు విస్తీర్ణం దాదాపు 8 రెట్లు పెరగడం గమనార్హం. ఇక ఈ ఏడాది జులై 10 నాటికి అది 57.5 లక్షల హెక్టార్లకు చేరుకోవడం విశేషం. ఇందులో చెరుకు ఆధారిత ఎథనాల్ ఉత్పత్తి అత్యంత కీలక పాత్ర పోషించింది. ఎథనాల్ కొనుగోళ్లకు ప్రభుత్వం నుండి లభిస్తున్న మద్దతుతో చక్కెర

మిల్లుల ఆదాయం పెరగడమే కాకుండా, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగి అదనపు ఆదాయం సమకూరింది. దీంతో దేశవ్యాప్తంగా రైతులు చెరుకు సాగు వైపు విపరీతంగా మొగ్గు చూపారు. అయితే, చెరుకు సాగుకు విపరీతంగా నీటి వినియోగం అవసరమవుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఏఐతో పాటు కంపెనీ అసలైన సంపద కూడా...



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను వేగంగా స్వీకరిస్తున్న సంస్థలు, దాని ద్వారా లాభాలు పొందడంతో పాటు తమ అత్యంత విలువైన సంస్థాగత జ్ఞానసంపదను కూడా అనుకోకుండా ఏఐ కంపెనీలకు అందించే ప్రమాదం ఉ ందని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల హెచ్చరించారు. దీన్నే ఆయన 'రివర్స్ ఇన్ఫర్మేషన్ పారడాక్స్' గా అభివర్ణించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్టు చేసిన నాదెళ్ల, ఏఐ యుగంలో కంపెనీలు మేధస్సు కోసం ఒకసారి డబ్బుతో, రెండోసారి తమ సొంత పరిజ్ఞానంతో రెండుసార్లు చెల్లిస్తున్నాయని అన్నారు. ఏఐ నుంచి మెరుగైన ఫలితాలు కావాలంటే సంస్థలు ఎక్కువ సమాచారం, డేటా, పని విధానాలు, అనుభవాలను ప్రాంప్ట్‌ల రూపంలో పంచుకోవాల్సి వస్తోంది. దీంతో ఏఐ మోడళ్లు సంస్థల పని తీరును, నిర్ణయాలను, నైపుణ్యాన్ని క్రమంగా నేర్చుకుంటాయని ఆయన చెప్పారు. నోబెల్ గ్రహీత కెన్నెత్ ఆరో ప్రతిపాదించిన 'ఇన్ఫర్మేషన్ పారడాక్స్'ను ప్రస్తావించిన నాదెళ్ల, ఏఐ దానికి పూర్తి విరుద్ధమైన పరిస్థితిని తీసుకొచ్చిందని అన్నారు.ఇది కేవలం డేటా ప్రైవసీ సమస్య కాదు. ఉద్యోగులు చేసే ప్రతి ప్రాంప్ట్, ప్రతి సవరణ, ప్రతి మూల్యాంకనం ఏఐకి సంస్థలోని అనుభవం, నైపుణ్యం, నిర్ణయ సామర్థ్యాన్ని నేర్పిస్తుంది. కాలక్రమేణా ఏఐ సేవలందించే సంస్థలకు వినియోగదారుల గురించి మరింత సమాచారం చేరుతుంటే, తమ జ్ఞానం ఎలా ఉపయోగిస్తున్నారనే విషయం కస్టమర్లకు స్పష్టంగా తెలియదు. ఇదే కొనసాగితే ఏఐ ద్వారా సృష్టించే ఆర్థిక విలువలో పెద్ద భాగం ఏఐ మౌలిక సదుపాయాల యజమానులకే దక్కే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. దీనికి పరిష్కారంగా సంస్థలు తమ డేటా, సంస్థాగత జ్ఞానంపై పూర్తి నియంత్రణను కొనసాగించడం, ప్రైవేట్ ఏఐ లెర్నింగ్ వాతావరణాలను ఏర్పాటు చేయడం, ఒకే ఏఐ మోడల్‌పై ఆధారపడకుండా ఉండడం, ఫ్లెక్సిబుల్ ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించడం, అలాగే ప్రతి వినియోగంతో సంస్థకే విలువ పెరిగేలా నిరంతర లెర్నింగ్ వ్యవస్థను రూపొందించుకోవాలని నాదెళ్ల సూచించారు.

# భాగ్యనగరానికి మరో గ్లోబల్ రికార్డు..




రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకుంది. ప్రపంచంలోనే మోస్ట్ ఫ్యామిలీ ఫ్రెండ్లీ విమానాశ్రయాల జాబితాలో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ 4వ స్థానాన్ని కైవసం చేసుకుంది. యూకే కు చెందిన ప్రముఖ ట్రావెల్ ఎక్స్‌పీరియన్స్ ప్రొవైడర్ 'AttractionTickets.com' నిర్వహించిన అంతర్జాతీయ సర్వేలో ఈ గుర్తింపు లభించింది. ఈ ప్రతిష్టాత్మక గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్న కేవలం రెండు భారతీయ విమానాశ్రయాలలో హైదరాబాద్ ఒకటి కావడం విశేషం.

**140 విమానాశ్రయాల గుర్తింపు..**


అయితే, వరల్డ్‌వైడ్‌గా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 140 కంటే ఎక్కువ విమానాశ్రయాలను పరిశీలించి 'హ్యాపియెస్ట్ ఎయిర్‌పోర్ట్స్ ర్యాంకింగ్' పేరిట ఈ జాబితాను రూపొందించారు. మే 2026లో సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకులను ప్రకటించారు. కుటుంబ సమేతంగా ప్రయాణించే వారికి అవసరమైన సదుపాయాలు, భద్రత, సమర్థత వంటి 9 కీలక అంశాల ఆధారంగా ఈ సర్వే నిర్వహించగా హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 20 పాయింట్లకు గానూ 18.5 స్కోరును సాధించి ప్రపంచంలోనే నాలుగో స్థానంలో నిలిచింది.






# శ్రీలీలకు తగ్గిన జోరు

'పెళ్లి సందడి' సినిమాతో టాలీవుడ్కి హీరోయిన్గా పరిచయం అయ్యి, రవితేజతో కలిసి 'ధమాకా' సినిమా తో హిట్ కొట్టిన ముద్దుగుమ్మ శ్రీలీల. తెలుగు అమ్మాయి అయి నప్పటికీ లక్కీగా టాలీవుడ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు లక్ కలిసి రావడంతో శ్రీలీల టాలీవుడ్లో బ్యాక్ టు బ్యాక్ సినిమా ఛాన్స్ దక్కించుకుంది. ధమాకా విజయంతో దాదాపుగా అర డజను సినిమా ఛాన్స్లను శ్రీలీల దక్కించుకుంది. అంతే కాకుండా సోషల్ మీడియా లోనూ మంచి ఫాలోయింగ్ దక్కించుకుంది. మహేష్ బాబుతో గుంటూరు కారం సినిమా, అల్లు అర్జున్ పుష్ప 2 లో ఐటెం సాంగ్ చేయడం ద్వారా శ్రీలీల టాలీవుడ్లో టాప్ స్టార్ హీరోయిన్ రేంజ్లో పారితోషికం తీసుకోవడం మొదలు పెట్టింది. టాలీవుడ్ నిర్మాతలు శ్రీలీలకు కోరినంత పారితోషికం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. బిజీ బిజీగా సినిమాలు చేస్తూ, భారీ పారితోషికం అందుకుంటున్న హీరోయిన్ గా శ్రీలీల నిలిచింది. అయితే అందంతా గత ఏడాది వరకు మాత్రమే... ఈ ఏడాదిలో శ్రీలీల జోరు కనిపిం చడం లేదు. ప్రస్తుతం టాలీవుడ్లో శ్రీలీల చేస-్తున్న సినిమాలు ఏమీ లేవు. ఒకటి రెండు చర్చల దశలో ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. శ్రీలీల తన ఇమేజ్కు తగ్గ పాత్రలు కావాలి, తన కెరీర్ బి-ల్డ్ అయ్యే సినిమాలు కావాలని ఎదురు చూస్తున్నట్లుగా సమాచారం అందుతోంది. అందుకే టాలీవుడ్ లో ఈమె కొత్త సినిమాలు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. ఇదే సమయంలో బాలీవుడ్లో ఈమె ఒక సినిమాను చేస్తోంది. అది కూడా ఎప్పటికీ పూర్తి అయ్యి, ఎప్పుడు వస్తుందో క్లారిటీ లేదు.







# 'రాకా' సినిమాలో నైలా ..

తన కెరీర్లో మోస్ట్ ఎవైటెడ్ ప్రాజెక్ట్ అయిన 'రాకా' సినిమాలో భాగం కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. అట్లీ దర్శకత్వంలో నటించాలనే తన పదకొండేళ్ల కల నెరవేరిందని, ఇది కేవలం తన మనసులోని బలమైన కోరిక వల్లే సాధ్యమైందని తెలిపారు.తొలి సమావేశంలోనే తాను అట్లీ పనితీరును ఎంతగానో అభినందించానని, కేవలం హిందీ చిత్ర పరిశ్రమలోనే పనిచేసిన తనలాంటి నటితో కొలాబరేట్ అవ్వడానికి ఆయన ఎంతో హుందాగా అంగీకరించారని నైలా చెప్పారు. అట్లీ సినిమా మేకింగ్ ఒక మాస్టర్క్లాస్ లాంటిదని, అంత పెద్ద చిత్రాన్ని తెరకెక్కించడానికి ఆయన చూపే అంకితభావం, పట్టుదల తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రశంసించారు. ఈ చిత్రంలో లీడ్ రోల్స్ చేస్తున్న అల్లు అర్జున్, దీపికా పదుకొణెలతో స్క్రీన్ షేర్ చేసుకోవడంపై నైలా స్పందిస్తూ.. 'రాకా'లో ఆమెతో కలిసి నటించడం ఒక మరుపురాని అనుభూతిని ఇచ్చిందని అన్నారు. దీపికా తన స్టార్డమ్ కంటే కూడా పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని ప్రశంసించారు. ఇక అల్లు అర్జున్ గురించి చెబుతూ.. ఆయన ఇప్పటికే ఎంతో స్టార్డమ్ తెచ్చుకున్నప్పటికీ, ప్రతి సీన్ పర్ఫెక్ట్గా వచ్చేంతవరకు ఆయన చూపే శ్రద్ధ, కసి తనలాంటి కొత్త నటులకు ఎంతో స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ఇక 'రాకా' సినిమా గురించి చెబుతూ.. "ఈ చిత్రం సాధారణ సినిమాలకు భిన్నంగా, సరికొత్త పంథాలో ఉండబోతోంది. మేకింగ్ పరంగా, క్యారెక్టర్ల డిజైన్ పరంగా సినిమా సరిహద్దులను దాటి సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని నైలా పేర్కొన్నారు.

# ఇండియాలోనే మోస్ట్ అవైటెడ్ మూవీగా 'టాక్సిక్'..

'కేజీఎఫ్' సిరీస్తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాకింగ్ స్టార్ యష్ ఇప్పుడు 'టాక్సిక్'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. పలుమార్లు వాయిదా పడిన ఈ భారీ గ్యాంగ్స్టర్ యాక్షన్ డ్రామా ఇప్పటికే భారీ అంచనాలతో వస్తోంది. ఇప్పుడు ఆ అంచనాలకు మరింత హైప్ తెచ్చేలా మరో ఘనతను ఈ సినిమా సొంతం చేసుకుంది. ప్రముఖ మూవీ డేటాబేస్ ప్లాట్ఫామ్ IMDb విడుదల చేసిన తాజా జాబితాలో 'టాక్సిక్' ప్రస్తుతం ఇండియాలోనే అత్యంత ఆసక్తిగా ఎదురుచూ-స్తున్న మూవీగా మొదటి స్థానంలో నిలవడం విశేషంగా మారింది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం మొదటి నుంచే భారీ అంచనాలతో నిలుస్తోంది. యష్ను పూర్తిగా కొత్త అవతారంలో చూపించనున్న ఈ సినిమా గ్యాంగ్స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. విడుదలకు ముందు పలుమార్లు వాయిదా పడినప్పటికీ ప్రేక్షకుల ఆసక్తి మాత్రం ఏమాత్రం తగ్గలేదు. తాజాగా విడుదలైన 'లేడీస్ అండ్ లేడీస్' టీజర్తో పాటు 'తబాహి' పాటకు వచ్చిన అద్భుత స్పందన సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సోషల్ మీడియాలో ఈ ప్రమోషనల్ కంటెంట్కు వచ్చిన స్పందన కూడా సినిమాపై ఉన్న క్రేజ్ను స్పష్టంగా చూపిస్తోంది.ఇప్పుడు IMDb తాజా ర్యాంకింగ్స్లో 'టాక్సిక్' అగ్రస్థానంలో నిలవడం చిత్రబృందానికి మరో పెద్ద ఊరటనిచ్చింది. ఈ జాబితా సెర్చ్ ట్రెండ్స్ వంటి అంశాల ఆధారంగా రూపొందుతుండటంతో, విడుదలకు ముందే ఈ స్థాయి గుర్తింపు రావడం విశేషంగా భావిస్తున్నారు. దీంతో ఆగస్టు 26 విడుదలకు ముందు సినిమాపై బజ్ మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ




బడ్జెట్తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. యష్ సరసన కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. స్టార్ క్యాస్టింగ్, గీతూ మోహన్ దాస్ ప్రత్యేక మేకింగ్ శైలి కలిసి 'టాక్సిక్'ను ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా నిలబెట్టాయి. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# టాలీవుడ్‌కు ఒక గట్టి గుణపాఠం నేర్పిన మా ఇంటి బంగారం, లెనిన్








సినీ పరిశ్రమలో ఈ మధ్య కాలంలో సినిమా విడుదలైతే చాలుటికెట్ ధరలు పెంచేయడం, బుక్ మై షో రేటింగ్స్ను మేనేజ్ చేయడం లేదా కోర్టు ఆర్డర్స్ తెచ్చి రేటింగ్స్ ఆపాలని చూడడం, తెల్లవారుజామునే ప్రీమియర్ షోల హడావుడి చేయడం, చివరకు సినిమా నచ్చలేదని రివ్యూ రాసిన రివ్యూవర్లపై బెదిరింపులకు దిగడం వంటి ఎన్నో అడ్డదారులు తొక్కుతున్నారు కొందరు పెద్ద నిర్మాతలు, స్టార్ హీరోలు. తమ సినిమా ఫ్లాప్ అని తేలిపోతుందనే భయంతో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడానికి ఇలాంటి పద్ధతులు వాడుతున్నారు. కానీ ప్రేక్షకులను ఇలాంటి జిమ్మిక్కులతో మోసం చేయలేరని రుజువు చేస్తూ మా ఇంటి బంగారం, లెనిన్ సినిమాలు ఘన విజయం సాధించాయి.సమంత ప్రధాన పాత్రలో నటించిన ఎమోషనల్ ఫ్యామిలీ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. ఎలాంటి టికెట్ రేట్ల పెంపు లేకుండా నార్మల్ టికెట్ ధరలతో కేవలం కంటెంట్ బలాన్ని నమ్ముకుని ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఫలితంగా తెలుగు సినీ చరిత్రలోనే రూ. 100 కోట్ల క్లబ్లో చేరిన మొట్టమొదటి లేడి ఓరియెంటెడ్ సినిమాగా రికార్డు సృష్టించింది.మరోవైపు అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లెనిన్' కూడా ఎలాంటి స్పెషల్ బెనిఫిట్స్, టికెట్స్ ప్రైసింగ్ లేకుండా రిలీజ్ అయి అఖిల్ కెరీర్లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ సాధించి సత్తా చాటింది. నిజాయితీ గల కంటెంట్తో థియేటర్లలోకి వచ్చిన ఈ రెండు సినిమాలు సాధించిన విజయం ప్రమోషన్ల పేరుతో ప్రేక్షకులపై భారం వేసే స్టార్ హీరోలకు, కార్పొరేట్ ప్రొడక్షన్ హౌస్లకు ఒక బలమైన చెంపపెట్టు. ప్రేక్షకుల రేటింగ్స్ను అడ్డుకోవడానికి కోర్టుల చుట్టూ తిరగడం, రివ్యూవర్లను బెదిరించడం వంటి వ్యూహాలు కాకుండా... సినిమా కథపై కథనంపై దృష్టి పెడితే ప్రేక్షకులు బ్రహ్మరథం పడతారని ఈ విజయాలు నిరూపించాయి.ఇప్పటికైనా నిర్మాతలు, స్టార్స్ తమ పాత పద్ధతులను, అనవసరమైన వ్యూహాలను పక్కన పెట్టాలి. సినిమా విధిరాతను నిర్ణయించే అధికారాన్ని ప్రేక్షకుడికి వదిలేయాలి. ఎందుకంటే ప్రేక్షకుడు ఎప్పుడూ సరైన నిర్ణయమే తీసుకుంటాడు నిజమైన ప్రతిభను మంచి సినిమాను ఎల్లప్పుడూ ఆదరిస్తారు.

# వింటేజ్ లుక్లో జాన్వీ మ్యాజిక్

బాలీవుడ్ క్యూట్ బ్యూటీ జాన్వీ కపూర్ తన లే-టెస్ట్ ఫోటో షూట్తో సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. "ప్రస్తుతం నా జీవితాన్ని వింటేజ్ ఫిల్టర్ ద్వారా చూస్తున్నాను" అంటూ ఒపో రెనో 16 సిరీస్ ప్రమోషన్లో భాగంగా దిగిన కొన్ని క్రేజీ పిక్స్ను షేర్ చేసింది. పర్పుల్ ప్రింటెడ్ డ్రెస్, అలాగే ఆలివ్ గ్రీన్ జాకెట్ లుక్స్లో సాఫ్ట్ గ్లామ్ వైబ్స్ ఇస్తూ ఫ్యాన్స్ను విపరీతంగా ఆకట్టుకుంది. జాన్వీ నేచురల్ గ్లో, మెరిసే కళ్లు ఈ ఫోటోలకు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. జాన్వీ కపూర్ తాజాగా ఇన్స్టాగ్రామ్లో పెట్టిన పోస్ట్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. సరికొత్త ఒపో మొబైల్ పాప్ క్యామ్ దిగిన ఫోటోలను షేర్ చేస్తూ.. ఈ మధ్య కాలంలో తనకు వింటేజ్ లుక్స్ అంటే ఎంత ఇష్టమో చెప్పుకొచ్చింది. ఇకకొన్ని క్షణాలు కాస్త ఇంపర్ఫెక్ట్ గా ఉన్నప్పుడే చూడటానికి చాలా బాగుంటాయంటూ క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫోటోలలో జాన్వీ ఎంతో రిలాక్స్ గా, పెదవులపై చిన్న చిరునవ్వుతో కనిపిస్తూ కుర్రకారు మనసు దోచేస్తోంది. ఈ ఫోటో మాట్లో జాన్వీ కొన్ని డిఫరెంట్ లుక్స్లో మెరిసింది. ఒక ఫోటోలో వైబ్రెంట్ పర్పుల్ ప్రింటెడ్ స్లీవ్స్ డ్రెస్ వేసుకుని, చేతులకు బోహేమియన్ స్టైల్ బ్రాస్లెట్లు, మెడలో సింపుల్ లాకెట్ చైన్తో చాలా ట్రెండీగా కనిపించింది. ఇక మరో పిక్లో ఒలివ్ గ్రీన్ క్రాఫ్ట్ యుటిలిటీ డెనిమ్ జాకెట్, లోపల రాయల్ బ్లూ టీషర్ట్, క్లాసిక్ బ్లూ జీన్స్ వేసుకుని పక్కా స్టైలిష్ మోడ్రన్ అవతార్లో దర్శనమిచ్చింది. బ్రౌన్ లెదర్ బెల్ట్ వింటేజ్ లుక్కు మరింత ఎలివేట్ చేసింది.





# 'ది ప్యారడైజ్' టీమ్కు నో రెస్ట్..

టాలీవుడ్ క్రేజీ నటుడు నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం 'ది ప్యారడైజ్' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాను ఆగస్టు 21న విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించినప్పటికీ, ఆ తేదీన విడుదలయ్యే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయని ఇప్పటికే ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ 25 కూడా దగ్గరపడుతున్న నేపథ్యంలో షూటింగ్ను వేగంగా పూర్తి చేయడంపై మేకర్స్ దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా కోసం ఏకకాలంలో రెండు యూనిట్లు పనిచేస్తున్నాయని తెలుస్తోంది.ఒక యూనిట్ రాత్రి వేళల్లో చిత్రీకరణ జరుపుతుండగా, మరో యూనిట్లో కూడా షూటింగ్ కొనసాగుతోంది. నాని ఈ రెండు యూనిట్ల మధ్య సమయాన్ని పంచుకుంటూ ఎక్కడ షూటింగ్ ఉంటే అక్కడ పాల్గొంటూ చిత్రాన్ని త్వరగా పూర్తి చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నట్లు సమాచారం. అయితే నిర్ణయించిన గడువులోపు షూటింగ్ను పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 25న విడుదల చేయగలరా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో కయాదు లోహర్ కథానాయికగా నటిస్తుండగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. అనిరుద్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎల్వీ సినీమాస్ బ్యానర్పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



# రెబెల్ స్టార్ ప్రభాస్ లాంచ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్టైనర్ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ప్రమోషనల్ కంటెంట్తో ఇప్పటికే భారీ అంచనాలు క్రియేట్ కాగా.. తాజాగరెబెల్ స్టార్ ప్రభాస్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్ను విడుదల చేశారు. టీజర్ ప్రారంభంలో కనకరాజు వాయిస్ ఓవర్తో తన రాయలసీమలోని పెనుకొండ ఊరిని పరిచయం చేస్తాడు. అల్లరి, సరదాగా తిరిగే కనకరాజు జీవితం ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఊహించని మలుపు తిరుగుతుంది. ఇదే సమయంలో కొరియా నుంచి వచ్చిన ఓ రహస్యమైన పాత్రతో పాటు అతీంద్రియ శక్తులు కూడా వస్తాయి. ఆ కొరియన్ ఆత్మ కనకరాజును ఆవహించడంతో అతను 'కొరియన్ కనకరాజు' గా మారిపోతాడు. అక్కడి నుంచి కామెడీ, యాక్షన్, హారర్, ఫాంటసీ అంశాలతో కథ ఆసక్తికరంగా సాగుతుంది. వరుణ్ తేజ్ కనకరాజు పా-త్రలో చాలా సహజంగా ఒదిగిపోయారు. ముఖ్యంగా రాయలసీమ యాసను ఆయన పలికిన తీరు చాలా సహజంగా అనిపిస్తుంది. లాంగ్ హెయిర్ లుక్లో మాస్ అప్పీల్తో ఆకట్టుకున్న ఆయన, చివర్లో కొరియన్ కనకరాజుగా కనిపించే గెటప్ విజిల్స్ వేయించేలా ఉంది. ముఖ్యంగా సత్యతో కలిసి వచ్చే కామెడీ సన్నివేశాలు టీజర్లో హైలైట్గా నిలిచాయి. కొరియన్ అమ్మాయి పాత్రలో రితికా నాయక్ కూడా చాలా అందంగా కనిపించారు. 'కొరియన్ కనకరాజు' టీజర్ హారర్, కామెడీ, యాక్షన్, ఫాంటసీ అంశాలను వినోదాత్మకంగా పరిచయం చేస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. కొత్త కాన్సెప్ట్, ఆకట్టుకునే విజువల్స్, కమర్షియల్ ట్రీట్తో ఈ చిత్రం ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**